




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 224 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 20 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 224 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 20 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


# విజయసాయి ఒక బట్టేబాజ్... త్వరలోనే అతడి చరిత్ర మొత్తం చెబుతా

- ఏపీ లిక్కర్ స్కాం కేసులో రాజ్ కసిరెడ్డిపై తీవ్ర ఆరోపణలు
- ఇప్పటి వరకు రెండు సార్లు నోటీసులు ఇచ్చిన సిట్
- అజ్ఞాతం నుంచి ఆడియో సందేశం వెలువరించిన రాజ్ కసిరెడ్డి



పెన్ పవర్ డెస్క్:ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి తాజాగా ఓ ఆడియో సందేశం వెలువరించారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తనపై చేసిన ఆరోపణల పట్ల ఆయన ఈ ఆడియో క్లిప్పింగ్ ద్వారా బదులిచ్చారు. ఏపీ లిక్కర్ స్కాంను దర్యాప్తు చేస్తున్న సిట్ వరుస నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో, రాజ్ కసిరెడ్డి అజ్ఞాతం నుంచి ఆడియో సందేశం పంపడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆడియో క్లిప్పింగ్ లో రాజ్ కసిరెడ్డి ఏమన్నారంటే... "లిక్కర్ స్కాం కేసుకు సంబంధించి సిట్ అధికారులు నాకు రెండు సార్లు నోటీసులు పంపారు. నాపై వచ్చిన ఆరోపణల పట్ల నేను న్యాయపరంగా పోరాటం చేస్తున్నా. సిట్ నోటీసులపై న్యాయస్థానాన్ని ఆశ్రయించాను. నిర్ణీత సమయం ఇచ్చి నోటీసులు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. న్యాయపరమైన రక్షణ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించాను. ముందస్తు బెయిల్ కోసం కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాను. ప్రస్తుతం సుప్రీంకోర్టు ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నా. మద్యం కుంభకోణంతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నాపై విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణల్లో నిజం లేదు. న్యాయపోరాటం ముగిశాక మీడియాను పిలిచి విజయసాయిరెడ్డి చరిత్ర మొత్తం చెబుతా" అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాజ్ కసిరెడ్డి... విజయసాయిని 'బట్టేబాజ్ మనిషి' అని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఒకవైపు వాదనలు విని మీడియాలో వార్తలు ప్రసారం చేయొద్దని, తన వాదన కూడా వినాలని, త్వరలోనే మీడియా

వివరాలు 2లో..

## ఇంతకీ రాజ్ కసిరెడ్డి ఎక్కడ...?

- ఏపీలో లిక్కర్ స్కాంలో రాజ్ కసిరెడ్డిపై తీవ్ర ఆరోపణలు
- ఆడియో సందేశం వెలువరించిన రాజ్
- దాంతో అతడి ఆచూకీపై మరోసారి చర్చ

పెన్ పవర్ డెస్క్:ఏపీ లిక్కర్ స్కాంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి తాజాగా ఆడియో సందేశం వెలువరించిన నేపథ్యంలో, ఆయన ఎక్కడున్నారన్న విషయం మరోసారి చర్చనీయాంశంగా మారింది. రాజ్ కసిరెడ్డి ఆచూకీపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. గత ఏడాది ఆగస్టు 23న ఆయనపై లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేసినప్పటికీ, ఆయన నేపాల్ మీదుగా స్కాట్లాండ్ పారిపోయి, అక్కడి నుంచే న్యాయ పోరాటం చేస్తున్నారని, ఈ ఆడియో కూడా అక్కడి నుంచే పంపి ఉంటారని ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ వాదనల పట్ల పోలీసు వర్గాల నుంచి ఎలాంటి స్పందన లేదు. కసిరెడ్డి దేశం విడిచి వెళ్లలేదని, డిజిటల్ ఆధారాలు

వివరాలు 2లో..

## వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చక్రం తిప్పింది విజయసాయే

- విజయసాయిరెడ్డికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన వైవీ సుబ్బారెడ్డి
- జగన్ కోటరీ గురించి తీవ్ర విమర్శలు గుప్పించిన విజయసాయిరెడ్డి
- వైసీపీపై అభియోగాలు మోపేందుకు విజయసాయి చూస్తున్నారన్న సుబ్బారెడ్డి



పెన్ పవర్ డెస్క్:ఏపీ లిక్కర్ స్కామ్ కేసు విచారణకు రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి నిన్న హాజరైన సంగతి తెలిసిందే. విచారణ అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ జగన్ కోటరీ గురించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

వివరాలు 2లో..

## విజయనగరం జిల్లా పోలీస్ స్టేషన్ లో శ్రీరెడ్డి

- చంద్రబాబు, పవన్, లోకేశ్ లపై దారుణ వ్యాఖ్యలు చేసిన శ్రీరెడ్డి
- శ్రీరెడ్డిపై కేసు నమోదు చేసిన పోలీసులు
- పూసపాటిరేగ పోలీస్ స్టేషన్ కు వచ్చిన శ్రీరెడ్డి

వివరాలు 2లో..



## ఆఫ్ఘనిస్థాన్ లో భూకంపం... భారత్, పాక్ లోనూ ప్రకంపనలు



- ఆఫ్ఘనిస్థాన్‌లో 5.8 తీవ్రతతో భూకంపం నమోదు
- ఉత్తర భారత్‌లోని ఢిల్లీ, జమ్మూకశ్మీర్‌లో ప్రకంపనలు
- పాకిస్థాన్‌లో పలు ప్రాంతాల్లో కంపించిన భూమి

పెన్ పవర్ డెస్క్: మధ్యాహ్నం ఆఫ్ఘనిస్థాన్‌లో సంభవించిన భూకంపం ప్రభావం ఉత్తర భారతదేశంపైనా పడింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్, జమ్మూకశ్మీర్ సహా పలు ప్రాంతాల్లో భూమి కంపించడంతో ప్రజలు స్వల్ప భయాందోళనలకు గురయ్యారు. అయితే, భారత్‌లో ఎక్కడా ఆస్తి లేదా ప్రాణ

వివరాలు 2లో..

## హైదరాబాద్‌లోని నిమ్స్ అత్యవసర విభాగంలో మంటలు

- ఐదో అంతస్తులో మంటలు కిటికీల నుంటి దట్టమైన పొగలు
- కిటికీ నుంచి దట్టమైన పొగలు రావడంతో బయటకు పరుగు
- మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది




పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్, నిమ్స్ ఆసుపత్రి అత్యవసర విభాగంలో అగ్ని ప్రమాదం జరిగింది. అత్యవసర విభాగంలోని ఐదో అంతస్తులో మంటలు వచ్చాయి. కిటికీల నుంచి దట్టమైన పొగలు బయటకు రావడంతో ఆసుపత్రిలో ఉన్న వారు అందరూ బయటకు పరుగు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలికి చేరుకొని మంటలను అదుపు చేస్తున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## మిథున్ రెడ్డిని 8 గంటల పాటు ప్రశ్నించిన సిట్ అధికారులు

- ఏపీలో లిక్కర్ స్కాం ప్రకంపనలు
- విచారణ ముమ్మరం చేసిన సిట్
- మిథున్ రెడ్డిని పలు కోణాల్లో ప్రశ్నించిన సిట్



పెన్ పవర్ డెస్క్:ఏపీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను వేగవంతం చేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనుసరించిన మద్యం విధానం, ధరల నిర్ణయం, బ్రాండ్ల ఎంపిక, మద్యం సరఫరాదారులతో కుమ్మక్కు వంటి ఆరోపణలపై సిట్ దృష్టి సారించింది.

వివరాలు 2లో..

## ఏపీ టీడీపీ ఎమ్మెల్యేకు హైదరాబాద్ హైడ్రా షాక్

### కొండాపూర్ లోని ఫామ్ హౌస్ కూల్చివేత




పెన్ పవర్ డెస్క్:హైడ్రా దూకుడు పెంచింది.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతోంది హైడ్రా.. ఆక్రమణలకు పాల్పడింది ఎవరన్నది చూడకుండా కూల్చివేతలే టార్గెట్ గా వెళ్తున్న హైడ్రా ఇప్పుడు ఏపీ టీడీపీ ఎమ్మెల్యేకు భారీ షాక్ ఇచ్చింది. ఏపీలోని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కు చెందిన ఫామ్ హౌస్ ను కూల్చేశారు హైడ్రా అధికారులు. శనివారం

వివరాలు 2లో..

## నిద్ర మొహం బైడెన్... అమెరికా చరిత్రలోనే అత్యంత చెత్త ప్రెసిడెంట్

- మాజీ అధ్యక్షుడు బైడెన్‌పై ట్రంప్ తీవ్ర విమర్శలు
- లక్షల మంది నేరస్థులు దేశంలోకి వచ్చారని ఆరోపణ
- వారిలో హంతకులు, డ్రగ్ డీలర్లు, ఖైదీలున్నారని ట్రంప్ వ్యాఖ్య
- నేరస్థులను బయటకు పంపడమే తన పని అని స్పష్టం
- MAGA నినాదాన్ని పునరుద్ఘాటించిన ట్రంప్

పెన్ పవర్ డెస్క్:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్... మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌పై, ఆయన అనుసరించిన వలస విధానాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నిద్ర మొహం బైడెన్ అసమర్థ పాలన, లోపభూయిష్టమైన సరిహద్దు విధానాల

వివరాలు 2లో..




## వ్యభిచారం కేసు పెడతానని కృష్ణవేణిని సీఐ బెదిరించారు

- వెంకయ్యనాయుడు, లోకేశ్ పై కృష్ణవేణి అనుచిత పోస్టులు
- గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ లో ఉన్న కృష్ణవేణి
- కృష్ణవేణి పట్ల దాచేపల్లి సీఐ దారుణంగా వ్యవహరించారన్న అంబటి

వివరాలు 2లో..



## కొనసాగుతున్న ఉపరితల ద్రోణి... ఏపీకి వర్ష సూచన

- మహారాష్ట్ర నుంచి తమిళనాడు వరకు ద్రోణి
- సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్న ద్రోణి
- ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



పెన్ పవర్ డెస్క్:ఉత్తర మధ్య మహారాష్ట్ర నుంచి గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉపరితల ద్రోణి ఏర్పడింది. ఈ ద్రోణి తెలంగాణ, కర్ణాటక, రాయలసీమ, తమిళనాడు మీదుగా కొనసాగుతోంది. సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో

వివరాలు 2లో..

## కుట్రలు, కుతంత్రాలతో విశాఖ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు

- మేయర్ ను కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా గద్దె దించిందన్న కన్నబాబు
- కూటమి పాలనలో అధర్మం రాజ్యమేలుతోందని విమర్శ
- విలువలు లేని వ్యక్తి చంద్రబాబు అని మండిపాటు



పెన్ పవర్ డెస్క్:విశాఖ మేయర్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని కూటమి ఖూనీ చేసిందని వైసీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. కుట్రలు, కుతంత్రాలతో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నారని విమర్శించారు. యాదవ మహిళకు మేయర్ పదవిని జగన్ ఇచ్చారని... ఆమెను అప్రజాస్వామికంగా కూటమి ప్రభుత్వం గద్దె దించిందని మండిపడ్డారు. చావుబతుకుల మధ్య కూటమి సర్కార్ మ్యాజిక్ ఫిగర్ కు చేరుకుందని కన్నబాబు ఎద్దేవా చేశారు. కూటమి పాలనలో అధర్మం రాజ్యమేలుతోందని అన్నారు

వివరాలు 2లో..

## మజ్లిస్ పార్టీని గెలిపిస్తే వారిని పాతరేస్తాం

- మజ్లిస్‌ను గెలిపించేందుకే బీఆర్ఎస్ ఓటింగ్‌కు దూరంగా ఉంటోందని వ్యాఖ్య
- కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని ఆరోపణ
- ఓటింగ్‌లో పాల్గొనకపోవడం అంటే ప్రజాస్వామ్యాన్ని ధిక్కరించినట్లేనని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో మజ్లిస్ పార్టీని గెలిపిం చేందుకే బీఆర్ఎస్ ఓటింగ్‌కు దూరంగా ఉంటోందని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. భాగ్యనగరంలో మజ్లిస్ పార్టీని గెలిపిస్తే బీఆర్ఎస్ పార్టీని పాతరేస్తామని

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

### జవాబు జగన్ చెప్పాల్సిందే.. ఇలా అయితే ఎవరుంటారు పార్టీలో?

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మాటలను చూస్తుంటే ఒక్కటి మాత్రం అర్థం అవుతుంది. ఈ పరిస్థితిని జగన్ చేజేతులానే తెచ్చుకుంటున్నారు. నమ్మకమైన వారిని కూడా స్వయంగా జగన్ దూరం చేసుకుంటున్నారు. విజయసాయిరెడ్డి చెప్పే విషయాల్లో నిజాయితీ కనిపిస్తుంది. ఎందుకంటే సాయిరెడ్డి జగన్ పై ఎలాంటి దూషణలు చేయడం లేదు. అలాగే మద్యం కుంభకోణం విషయంలో డబ్బులు చేతులు మారాయన్న విషయం కూడా తనకు తెలియదనే సిట్ అధికారులకు చెప్పినట్లు తెలిసింది. అయితే రాజ్ కసిరెడ్డిపైనే ఆయన అక్కసు అంతా వెళ్లగక్కినా, జగన్ మాత్రమే కాదు ఆయన చుట్టూ ఉన్న కోటరీపైనే విజయసాయిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కావాలని తప్పుదోవ పట్టిస్తూ...**

జగన్ ను కొందరు కావాలని తప్పుదోవ పట్టించేలా వ్యవహరించారని అంటున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలల నుంచి తనను జగన్ దూరం పెడుతున్నారని ఆయన చెబుతున్న మాటల్లో వాస్తవముంది. ఎందుకంటే అప్పటి వరకూ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ గా ఉన్న విజయసాయిరెడ్డిని తప్పించి వైవీ సుబ్బారెడ్డికి బాధ్యతలను అప్పగించడంతోనే అందరికీ అర్థమయింది. దీంతో పాటు సాయిరెడ్డితో జగన్ అనుబంధాన్ని కట్ చేయడానికి అనేక మంది గత ఐదేళ్లలో కీలకంగా పనిచేశారన్నది కూడా వాస్తవమే. నిజానికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నుంచి జగన్ వరకూ విజయసాయిరెడ్డి కేవలం ఆడిటర్ గా మాత్రమే కాకుండా సొంత ఇంట్లో సభ్యుడిగా వ్యవహరించారు.

**నమ్మకమైన వారికే...**

జగన్ తో పాటు పదహారు నెలలు జైలుకు కూడా వెళ్లి వచ్చారు. జగన్ అధికారంలో లేనప్పుడు, ఉన్నప్పుడు సాయిరెడ్డి జగన్ మీద ఈగ వాలనిచ్చే వారు కాదు. అలాగే ప్రత్యర్థి పార్టీలపై సోషల్ మీడియాలో ఒక రేంజ్ లో ధ్వజమెత్తేవారు. సాయిరెడ్డి జగన్ ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో కూడా ఎక్కువ సార్లు సీఎం క్యాంప్ కార్యాలయంలో కూడా కనిపించే వారు కాదు. జగన్ తనకు ఢిల్లీలో అప్పగించిన బాధ్యతలను పూర్తి చేయడం వరకు మాత్రమే ఆయన పరిమితమయ్యారు. నాడు బీజేపీతో సంబంధాలు మంచిగా కొనసాగేలా సాయిరెడ్డి ఢిల్లీలో ఉండి పనులు చక్కబెట్టేవారు. ఒకరకంగా జగన్ ఐదేళ్ల పాటు ఢిల్లీ విషయాలను సాయిరెడ్డి మర్చిపోయేటట్లు చేశారు.

**సాధారణ నేతల పరిస్థితి ఏంటి?**

అలాంటి సాయిరెడ్డిని జగన్ దూరం చేసుకోవడం స్వయం కృతాపరాధం కాదా? జగన్ ఇక ఎవరిని నమ్ముతారు? తనంటే ఇష్టపడేవారిని, ప్రేమించే వారిని అధికారంలోకి వచ్చిన తర్వాత చెప్పుడు మాటలు విని దూరం చేసుకుంటే ఇక ఆయనకు ఎవరు మద్దతుగా నిలుస్తారు. కొన్నేళ్ల నుంచి నమ్మిన వ్యక్తినే జగన్ దూరం చేస్తే ఇక సాధారణ నేతల పరిస్థితి ఏంటని ఎవరికైనా ఆలోచన రాకమానదు. అందుకే జగన్ ఆలోచన కరెక్ట్ కాదు. ఇప్పుడు కోటరీ వాళ్లను కూడా దూరం చేయరని గ్యారంటీ ఏముంది? అందుకే జగన్ కు అందరూ దూరమవుతున్నారు. సొంత బంధువైన బాలినేని వంటి వారు మాత్రమే దూరమయితే ఇక మామూలు రాజకీయ నేతల మాటేమిటన్న సందేహం సహజంగా వైసీపీలో కొనసాగే నేతల్లో కలుగుతుంది. దీనికి జవాబు జగన్ చెప్పాల్సిందే.

# వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చక్రం తిప్పింది విజయసాయే

- మొదటి పేజీ తరువాయి

కోటరీ వల్ల తాను చాలా ఇబ్బంది పడ్డానని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో విజయసాయిరెడ్డికి వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

వైసీపీ నుంచి వెళ్లిపోయిన తర్వాత పార్టీపై ఏదోరకంగా అభియోగాలు మోపాలని విజయసాయి చూస్తున్నారని సుబ్బారెడ్డి అన్నారు. ఆయన చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని చెప్పారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు చక్రం తిప్పింది విజయసాయేనని... పార్టీలో కోటరీ ఉందో, లేదో ఆయనకు తెలియదా? అని ప్రశ్నించారు. కోటరీ నడిపింది ఎవరో ఆయనకు తెలియదా? అని అడిగారు.

వైసీపీలో నెంబర్ 2 నుంచి 2 వేల స్థానానికి పడిపోయానని విజయసాయి అన్నారని... పార్టీలో నెంబర్ 2 అనేదే లేదని నెంబర్ వన్ నుంచి 100 వరకు అన్నీ జగనేనని సుబ్బారెడ్డి చెప్పారు.

వైసీపీ హయాంలో ఎలాంటి స్కాములు జరగలేదని... తమ పార్టీ నేతలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని విమర్శించారు. లిక్కర్ స్కామ్ అంటూ కొందరిని భయపెట్టి లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అన్నింటిపైనా న్యాయపోరాటం చేస్తామని చెప్పారు.

# విజయనగరం జిల్లా పోలీస్ స్టేషన్ లో శ్రీరెడ్డి

**పెన్ పవర్ డెస్క్:** నటి శ్రీరెడ్డిని విజయనగరం జిల్లా పూసపాటిరేగ పోలీసులు విచారిస్తున్నారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లపై దారుణమైన వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన శ్రీరెడ్డి ఈరోజు పోలీస్ స్టేషన్ లో విచారణకు హాజరయింది. విచారణకు హాజరు కావాలంటూ పోలీసులు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆమె పోలీస్ స్టేషన్ కు వచ్చింది. పీఎస్ కు వచ్చిన ఆమెను పోలీసులు విచారిస్తున్నారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో శ్రీరెడ్డి అడ్డూఅదుపు లేకుండా చెలరేగిపోయింది. మహిళ అనే విచక్షణ కూడా లేకుండా సోషల్ మీడియా వేదికగా బండ బూతులు

మాట్లాడింది. అయితే ఎన్నికల్లో కూటమి గెలిచిన వెంటనే ఆమె స్వరం మార్చింది. తనను క్షమించాలని, ఇకపై రాజకీయాల గురించి మాట్లాడనని ఆమె వేడుకుంది. 'నారా లోకేశ్ అన్నయ్యా క్షమించండి' అంటూ బహిరంగంగా క్షమాపణలు కూడా చెప్పింది. అయితే ఆమెపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న కూటమి కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆమెపై కేసు నమోదు చేసిన పోలీసులు... విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారు. దీంతో ఆమె విచారణకు హాజరయ్యారు.

# కొనసాగుతున్న ఉపరితల ద్రోణి... ఏపీకి వర్ష సూచన

- మొదటి పేజీ తరువాయి

ఉపరితల ద్రోణి విస్తరించి ఉందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) వెల్లడించింది. కాగా, ద్రోణి ప్రభావంతో కోస్తాంధ్రలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడతాయని, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ సంస్థ పేర్కొంది. రాయలసీమలోనూ ఇదే తరహాలో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ నెల 25 వరకు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని తెలిపింది. కాగా, ఏపీలో రాగల 4 రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశముందని, ఆ తర్వాత స్వల్పంగా తగ్గవచ్చని ఐఎండీ వివరించింది.

# విజయసాయి ఒక బట్టేబాజ్... త్వరలోనే అతడి చరిత్ర మొత్తం చెబుతా

- మొదటి పేజీ తరువాయి

ముందుకు వచ్చి విజయసాయి వ్యవహారంతో సహా అన్ని విషయాలు చెబుతానని వెల్లడించారు. కాగా, సిట్ నోటీసులకు తాను స్పందించానని రాజ్ కసిరెడ్డి వెల్లడించారు. నోటీసులపై తన న్యాయవాదులను సంప్రదించగా, సిట్ మిమ్మల్ని సాక్షిగా పేర్కొంటోందని, అయితే అరెస్ట్ చేసే అవకాశముందని వారు చెప్పారని వివరించారు. తనకు సిట్ రెండుసార్లు నోటీసులు ఇచ్చిందని కసిరెడ్డి ఆడియోలో అంగీకరించారు. మొదటి నోటీసు తాను లేని సమయంలో తన తల్లికి ఇచ్చారని, రెండో నోటీసు మెయిల్ ద్వారా పంపి మరుసటి రోజే విచారణకు రమ్మన్నారని తెలిపారు. విచారణకు సహకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అయితే తనను ఎందుకు విచారణకు పిలుస్తున్నారో స్పష్టం చేయాలని సిట్ ను కోరినట్లు తెలిపారు.

# మిథున్ రెడ్డిని 8 గంటల పాటు ప్రశ్నించిన సిట్ అధికారులు

- మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలో పలువురు కీలక వ్యక్తులను విచారిస్తోంది.

ఈ క్రమంలో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి నేడు విజయవాడలోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. అధికారులు ఆయన్ను సుదీర్ఘంగా ప్రశ్నించారు. శనివారం ఉదయం సిట్ కార్యాలయానికి చేరుకున్న మిథున్ రెడ్డిని, అధికారులు దాదాపు ఎనిమిది గంటల పాటు విచారించారు. ఈ సుదీర్ఘ విచారణలో భాగంగా, మద్యం కుంభకోణానికి సంబంధించిన పలు కీలక అంశాలపై, ముఖ్యంగా కొన్ని డిస్టిలరీలకు అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలపై సిట్ అధికారులు ఆయన్ను ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా రాజ్ కసిరెడ్డికి చెందిన ఆదాన్ డిస్టిలరీ, డికార్ట్ నుంచి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ చేసిన కొనుగోళ్లు... రాజ్ కసిరెడ్డితోనూ, ఆయన అనుచరులు చాణక్యరాజ్, అవినాశ్ రెడ్డిలతో ఉన్న సంబంధాలపైనా మిథున్ రెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నించినట్టు తెలుస్తోంది. వారితో ఆర్థిక లావాదేవీలపైనా కూపీ లాగే ప్రయత్నం చేశారు. అయితే మిథున్ రెడ్డి కొన్ని ప్రశ్నలకే సమాధానం చెప్పినట్టు సమాచారం. విచారణ అనంతరం మిథున్ రెడ్డి నుంచి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి, దానిపై ఆయన సంతకాన్ని తీసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు మిథున్ రెడ్డిని న్యాయవాది సమక్షంలో విచారించారు.

# ఇంతకీ రాజ్ కసిరెడ్డి ఎక్కడ...?

- మొదటి పేజీ తరువాయి

లభించకుండా ఉండేందుకు నిరంతరం ప్రాంతాలు మారుస్తూ ఇక్కడే రహస్య ప్రదేశంలో తలదాచుకున్నారని పోలీసులు భావిస్తున్నట్టు తెలుస్తోంది. సిట్ దర్యాప్తు ముమ్మరం.. సోదాలు, పత్రాల స్వాధీనం మరోవైపు సిట్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కసిరెడ్డి కోసం హైదరాబాద్‌లోని 15 ప్రాంతాల్లో ఆయన బంధువులు, స్నేహితుల ఇళ్లతో పాటు, ఆయన పెట్టుబడులు పెట్టినట్లు భావిస్తున్న అరిటా హాస్పిటల్స్, ఈడీ క్రియేషన్స్ వంటి సంస్థలపై దాడులు నిర్వహించారు. 2019 నుంచి 2024 మధ్య జరిగిన లావాదేవీలకు సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. విజయసాయి రెడ్డి ప్రస్తావించిన నలుగురు వ్యక్తులతో పాటు, ఆయా సంస్థల డైరెక్టర్లకు సోమవారం నుంచి నోటీసులు జారీ చేసి, పెట్టుబడుల మూలాలపై విచారించాలని సిట్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కసిరెడ్డి ఆడియో సందేశం ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై కూడా సిట్ ఆరా తీస్తోంది.

# వ్యభిచారం కేసు పెడతానని కృష్ణవేణిని సీఐ బెదిరించారు

**పెన్ పవర్ డెస్క్:** భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి నారా లోకేశ్ లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ పాలేటి కృష్ణవేణి ప్రస్తుతం గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ లో ఉన్న సంగతి తెలిసిందే. జైల్లో ఉన్న కృష్ణవేణిని ములాఖత్ ద్వారా వైసీపీ నేతలు అంబటి రాంబాబు, దొంతిరెడ్డి వేమారెడ్డి, పార్టీ లీగల్ సెల్ ప్రతినిధులు కలిశారు. అనంతరం మీడియాతో అంబటి రాంబాబు మాట్లాడుతూ... పాలేటి కృష్ణవేణి పట్ల దారుణంగా వ్యవహరించిన దాచేపల్లి సీఐ పొన్నూరు భాస్కర్ పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాయంత్రం 5 గంటలకు కృష్ణవేణిని హైదరాబాద్ లో అరెస్ట్ చేసి దాచేపల్లికి తీసుకెళ్లారని... మరుసటి రోజు ఉదయం వరకు స్టేషన్ లోనే ఉంచి కనీసం ఆహారం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు.

కృష్ణవేణి పట్ల

సీఐ భాస్కర్ అసభ్యకరంగా మాట్లాడారని అంబటి అన్నారు. వైసీపీ నేతల పేర్లు చెప్పమని కృష్ణవేణిని హింసించారని... చెప్పినట్టు వినకపోతే కృష్ణవేణి భర్తపై గంజాయి కేసు పెడతానని బెదిరించారని మండిపడ్డారు. కృష్ణవేణిపై వ్యభిచారం కేసు కూడా పెడతానని భయపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే వ్యభిచారం కేసు పెడతానని బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నిద్ర మొహం బైడెన్... అమెరికా చరిత్రలోనే అత్యంత చెత్త ప్రెసిడెంట్

- మొదటి పేజీ తరువాయి

కారణంగా లక్షలాది మంది నేరస్థులు అమెరికాలోకి ప్రవేశించారని ట్రంప్ ఆరోపించారు. తాజాగా చేసిన వ్యాఖ్యలలో, ట్రంప్ బైడెన్‌నుద్దేశించి ఘాటు పదజాలం ఉపయోగించారు. "అమెరికా చరిత్రలోనే అత్యంత చెత్త అధ్యక్షుడైన జో బైడెన్, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది నేరస్థులను మన దేశంలోకి అనుమతించారు" అని పేర్కొన్నారు. ప్రమాదకరమైన, అనాలోచిత 'బహిరంగ సరిహద్దు' (Open Border) విధానం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆయన విమర్శించారు. దేశంలోకి వచ్చిన వారిలో చాలామంది హంతకులు, మాదకద్రవ్యాల వ్యాపారులు ఉన్నారని, ప్రపంచంలోని అనేక జైళ్లు, మానసిక వైద్యశాలల నుంచి విడుదలైన వ్యక్తులు కూడా ఉన్నారని ట్రంప్ ఆరోపించారు. "ఈ హంతకులు, దుండగులను ఇక్కడి నుంచి పంపించివేయడం నా పని. దానికోసమే నన్ను ప్రజలు ఎన్నుకున్నారు... ఇలా చేయక తప్పడంలేదు, నన్ను క్షమించండి" అని ట్రంప్ స్పష్టం చేశారు. తన మద్దతుదారులను ఉద్దేశిస్తూ, 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' (MAGA) నినాదాన్ని కూడా ట్రంప్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు

# ఆఫ్ఘనిస్థాన్ లో భూకంపం... భారత్, పాక్ లోనూ ప్రకంపనలు

- మొదటి పేజీ తరువాయి

నష్టం జరిగినట్లు తక్షణ సమాచారం లేదు. ఇదే సమయంలో పాకిస్థాన్‌లోనూ భూమి కంపించింది. భారత జాతీయ భూకంప అధ్యయన కేంద్రం (National Center for Seismology – NCS) వెల్లడించిన వివరాల ప్రకారం, శనివారం మధ్యాహ్నం 12:17 గంటలకు (భారత కాలమానం ప్రకారం) ఆఫ్ఘనిస్థాన్‌లో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.8గా నమోదైంది. ఈ భూకంపం కారణంగా ఉత్తర భారతదేశంలోని ఢిల్లీ-ఎన్‌సీఆర్, జమ్మూకశ్మీర్ వంటి ప్రాంతాల్లో భూమి కొద్దిసేపు కంపించింది. శ్రీనగర్‌లోని ఒక కార్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తి మాట్లాడుతూ, "నేను కూర్చున్న కుర్చీ కదలడంతో భూమి కంపించినట్లు గ్రహించాను" అని తెలిపారు. ప్రకంపనలతో కొద్దిసేపు ఆందోళన నెలకొన్నప్పటికీ, భారత్‌లో ఇప్పటివరకు ఎలాంటి నష్టం జరిగినట్లు వార్తలు రాలేదని, పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిసింది. కాగా, పాకిస్థాన్‌లో కూడా భూ ప్రకంపనలు సంభవించాయి. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 11:47 గంటలకు 5.9 తీవ్రతతో భూకంపం వచ్చినట్లు పాకిస్థాన్ నేషనల్ సీస్మిక్ మానిటరింగ్ సెంటర్ (%చీవీజ%) పేర్కొంది. దీని భూకంప కేంద్రం ఆఫ్ఘనిస్థాన్-తజికిస్థాన్ సరిహద్దు ప్రాంతంలో, భూమికి 94 కిలోమీటర్ల లోతున ఉన్నట్లు గుర్తించారు. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్, లాహోర్, రావల్పిండి,

పెషావర్ నగరాలతో పాటు ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా రాష్ట్రంలోని లోయర్ దిర్, బజౌర్, మలకంద్, నౌషెరా, దిర్ బాల, షబ్కదర్, మొహమండ్ వంటి పలు ప్రాంతాల్లో భూమి తీవ్రంగా కంపించింది. దీంతో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే, పాకిస్థాన్‌లో కూడా ఇప్పటివరకు ఎలాంటి ఆస్తి లేదా ప్రాణ నష్టం జరిగినట్లు సమాచారం లేదు. పాక్ లోని ఈ ప్రాంతంలో వారం రోజుల వ్యవధిలో భూకంపం రావడం ఇది రెండోసారి. గత శనివారం కూడా పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌తో పాటు ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా, పంజాబ్ ప్రావిన్స్‌లలోని కొన్ని ప్రాంతాల్లో 5.5 తీవ్రతతో భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. పాకిస్థాన్ భూకంపాల ముప్పు ఎక్కువగా ఉన్న ప్రాంతం కాగా, 2005లో సంభవించిన భారీ భూకంపం 74,000 మందికి పైగా ప్రాణాలను బలితీసుకుంది.

# ఏపీ టీడీపీ ఎమ్మెల్యేకు హైదరాబాద్ హైడ్రా షాక్

- మొదటి పేజీ తరువాయి

( ఏప్రిల్ 19 ) కొండాపూర్ లోని సర్వే నంబర్ 79లో ఉన్న ఎమ్మెల్యే ఫామ్ హౌస్ ను కూల్చేశారు హైడ్రా అధికారులు. ప్రభుత్వ స్థలం ఆక్రమించి ఫామ్ హౌస్ తో పాటు ఆఫీస్ నిర్మించినట్లు తెలిపారు అధికారులు. సుప్రీం కోర్టులో కేసు పెండింగ్ లో ఉండగా ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ నిర్మాణాలు చేపట్టారని..సర్వే నెంబర్ 79 లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు అధికారులు. సర్వే నంబర్ 79లో ఉన్న 39 ఎకరాల్లో ఉన్న కమర్షియల్ షెడ్లను కూల్చేశారు హైడ్రా అధికారులు. ఈ క్రమంలో కూల్చివేతలు అడ్డుకునేందుకు ప్రయత్నించారు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ కుటుంబసభ్యులు. పోలీసు బందోబస్తు మధ్య ఫామ్ హౌస్ కూల్చివేతలు చేపట్టారు అధికారులు. సర్వే నంబర్ 79లో ఎలాంటి నిర్మాణంకు చేపట్టవద్దని బోర్డు ఏర్పాటు చేశారు అధికారులు.

# మజ్లిస్ పార్టీని గెలిపిస్తే వారిని పాతరేస్తాం

- మొదటి పేజీ తరువాయి

అన్నారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. కౌన్సిలర్లకు విప్ జారీ చేస్తామని, విప్ ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కేటీఆర్ ప్రకటనపై రాజాసింగ్ స్పందించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తున్నామని ప్రకటించడంతో బీఆర్ఎస్ బండారం బట్టబయలు అయిందని రాజాసింగ్ అన్నారు. ఈ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీని గెలిపించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్ర పన్నాయని ఆరోపించారు. ఈ మూడు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని అన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు మజ్లిస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే వారి రాజకీయ భవిష్యత్తు ఖతమైనట్లే అని రాజాసింగ్ అన్నారు. ఓటింగ్‌లో పాల్గొనకపోవడం అంటే ప్రజాస్వామ్యాన్ని ధిక్కరించినట్లు అవుతుందని ఆయన పేర్కొన్నారు. కార్పొరేటర్లు అంతరాత్మ ప్రబోధానుసారం ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

# కుట్రలు, కుతంత్రాలతో విశాఖ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు

- మొదటి పేజీ తరువాయి

. కూటమి నేతలకు గెలిచే బలం లేకపోయినా అవిశ్వాస తీర్మానం పెట్టారని... కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి గెలిచారని దుయ్యబట్టారు. విలువలు, విశ్వసనీయత లేని వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. కూటమిని తట్టుకుని నిలబడ్డ వైసీపీ కార్పొరేటర్లకు చేతులెత్తి మొక్కుతున్నామని అన్నారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

## కేంద్రీయ విచారణ కార్యాలయం పునర్వ్యవస్థీకరణపై టీటీడీ ఈవో సమీక్ష



**తిరుమల పెన్ పవర్ ఏప్రిల్ 19 :** తిరుమలలో పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా కేంద్రీయ విచారణ కార్యాలయంలో మెరుగైన వసతులు కల్పించేందుకు టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామల రావు అదనపు ఈఓ శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి శనివారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో కేంద్రీయ విచారణ కార్యాలయం పునర్వ్యవస్థీకరణపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత రద్దీ పరిస్థితులను చక్కదిద్దడం, కొన్ని దశాబ్దాలుగా ఉన్న భవనాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం, అలాగే వచ్చే కొన్ని దశాబ్దాల అవసరాలను దృష్టిలో ఉంచుకోవడం ఈ ప్రణాళిక యొక్క ముఖ్య ఉద్దేశమని ఈఓ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీటీడీ చీఫ్ ఇంజినీర్ సత్య నారాయణ, టీటీడీ పట్టణ ప్రణాళిక- డిజైన్ నిపుణులు రాముడు, తిరుమల ఎస్టేట్ అధికారి వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, వీజీవోలు రాంకుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా భాగస్వామ్యంతోనే "కాలుష్యం లేని చిత్తూరు" సాధ్యం

### గ్రామ పంచాయతీలు, పురపాలకల్లో ఈ-వేస్ట్ సేకరణ కేంద్రాలు : కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్





**చిత్తూరు, పెన్ పవర్ ఏప్రిల్19 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం మెరుగైన పారిశుధ్యం,పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేక లక్ష్యంతో కార్యక్రమాలను అమలు చేయడం జరుగు తున్నదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ్ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ నెల మూడో శనివారం "ఈ- చెక్" థీమ్ తో నిర్వహించిన కార్యక్రమాన్ని చిత్తూరు నగరపాలక కార్యాలయంలో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, మేయర్ ఎస్. అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ పి. నరసింహ ప్రసాద్ ప్రారంభించారు. చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన "ఈ - చెక్" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ... ప్రతినెల మూడో శనివారం మెరుగైన పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేక లక్ష్యంతో ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. నెలరోజుల పాటు క్షేత్రస్థాయిలో ఎలక్ట్రానిక్ వేస్ట్ నిర్వహణలో భాగంగా "ఈ చెక్" కార్యక్రమాన్ని.. అన్ని నగర, పుర పాలక సంస్థల పరిధిలో, గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో సుమారు 5వేల మెట్రిక్ టన్నుల ఈ-వేస్ట్ ఉత్పత్తి అవుతుందని అంచనా ఉందన్నారు. వీటిని సరైన పద్ధతుల్లో రీసైక్లింగ్ చేయకపోవడం వల్ల.. సల్ఫర్, ఇతర ప్రమాదకర మూలకాలు భూమిలో, వాతావరణంలో కలుస్తోందన్నారు. ఈ - వేస్ట్ (ఎలక్ట్రానిక్ పరికరాలు) నియంత్రించడంలో భాగంగా రానున్న నెల రోజుల పాటు క్షేత్రస్థాయిలో చేపట్టనున్న ఈ చెక్ కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. తమ గృహాలు, దుకాణాల్లోని వృధాగా ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల పరిధిలోని సచివాలయాల్లో అప్పగించాలని కోరారు. ఇలా సేకరించిన "ఈ వ్యర్థాలను" ప్రైవేటు వెండర్స్ ద్వారా హానికరం కాని రీతిలో రీసైక్లింగ్ చేయడం జరుగుతుందన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ... పారిశుద్ధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం "స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ" ఆంధ్ర ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం మంచి నిర్ణయం అన్నారు. మంచి పనులు చేస్తున్న ప్రభుత్వానికి, అధికారులకు ప్రజలు సహకరించాలని రానున్న నెల రోజులపాటు చేపట్టనున్న "ఈ-చెక్" కార్యక్రమాల్లో భాగంగా ప్రజలు తమ వద్దనున్న పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులను సచివాలయాల్లో అందించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజల సహకరించి "కాలుష్యం లేని చిత్తూరు" నగరంగా మార్చేందుకు అధికారులు, ప్రజలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. నగరపాలక కార్యాలయంలో చేపట్టిన "ఈ చెక్" కార్యక్రమంలో భాగంగా.. ప్రజా ప్రతినిధులు అధికారులు "స్వచ్ఛత ప్రతిజ్ఞ" చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని పిలుపునిచ్చారు. జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్ చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, ఎంహెచ్వో డా. లోకేష్, నగర పాలక అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.





### స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను

# పట్టిష్ఠంగా అమలు చేయాలి

### - జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి, పెన్ పవర్ ఏప్రిల్ 19 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారంను స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవంగా ప్రకటించిందని, అందులో భాగంగా మూడో శనివారం పారిశుద్ధ్యం, పరిశుభ్రతను దిశగా.. జిల్లాలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కోసం అందరి భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వర్ణ ఆంధ్ర ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించుకోవడం జరుగుతోందని తెలిపారు. గౌర ముఖ్యమంత్రి గారు రాష్ట్రంలో ప్రారంభించడం జరిగిందని, దీంట్లో భాగంగా ప్రతి నెల మూడో శనివారం ఒక ప్రత్యేక కార్యచరణతో ప్రతినెలకు కూడా ఒక థీమ్ తో ఈ కార్యక్రమాన్ని చేసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ స్వచ్ఛత గురించి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు, అనంతరం సానిటేషన్ వర్కర్లకు





స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం భాగంగా ఈ - చెక్ థీమ్ తో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తో కలిసి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని వారు చేసిన కృషిగాను ప్రశంస పత్రాలు అందజేసి జాయింట్ కలెక్టర్ వారి కార్యాలయం నుంచి వరకు ఎమ్మెల్యేతో కలిసి ర్యాలీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఎస్పీ గీత, తాసిల్దార్ చంద్రశేఖర్, ప్రజా ప్రతినిధులు ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు.

## టిటిడి సర్వ శ్రేయాస్ ట్రస్టుకు పది లక్షల విరాళం



**తిరుమల, పెన్ పవర్ 2025 ఏప్రిల్ 19 :** బెంగుళూరుకు చెందిన బీఎంకే నగేష్ అనే భక్తుడు టీటీడీ సర్వ శ్రేయాస్ ట్రస్టుకు శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి దాత తరఫున విరాళం డీడీని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి తిరుమలలోని అదనపు ఈవో కార్యాలయంలో అందజేశారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### 'స్వర్ణాంధ్ర... స్వచ్ఛ ఆంధ్ర..'లో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి





**బనగానపల్లె, పెన్ పవర్ ఏప్రిల్ 19 :** ప్రజల సంపూర్ణ సహకారంతోనే స్వచ్ఛాంధ్ర వంటి సామాజిక కార్యక్రమాలను విజయవంతం చేయగలమని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. బనగానపల్లెలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ వేస్ట్‌ను సేకరించడంతో పాటు, ప్రజల చేత స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను మంత్రి చేయించారు.

ఈ సందర్భంగా స్థానికంగా ఈ వేస్ట్ సైతం స్వయంగా మంత్రి తొలగించారు. 2047 స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా ప్రతి 3వ శనివారం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని మంత్రి అన్నారు. ఇప్పటికే బనగానపల్లెను 90 శాతం ప్లాస్టిక్ రహిత-పరిశుభ్రంగా తయారు చేశామన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించడం ద్వారా సర్క్యులర్ ఎకానమీ సాధ్యమవుతుందన్న ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు అందరు స్వచ్ఛంగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ, మన ఇంటితోపాటు మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలంతా కలసికట్టుగా స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛభారత్ కల సాకారం అయ్యేలా సహకరించాలన్నారు.

# కాలుష్య రహిత జిల్లాగా కడప..!

### - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### స్వచ్ఛ దివస్‌లో భాగంగా.. కడప నగరంలో "ఈ-చెక్" కార్యక్రమానికి శ్రీకారం

### 7 రోడ్స్ నుండి 1 టౌన్ సర్కిల్ వరకు వరకు.. సాగిన స్వచ్ఛతా ర్యాలీ



**కడప, పెన్ పవర్ ఏప్రిల్ 19 :** స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో.. భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాను కాలుష్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్, కడప నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డితో కలిసి.. జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి "ఈ-చెక్" (ఎలెక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ) కార్యక్రమాన్ని కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితి సింగ్, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులు రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కడప 7 రోడ్స్ నుండి స్వచ్ఛత ర్యాలీని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించగా 1 టౌన్ సర్కిల్ వరకు సాగిన స్వచ్ఛతా ర్యాలీలో అధికారులు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, గ్రీన్ అంబాసిడర్లు



తరువాయి 4లో..

## కర్నూలు అందుబాటులోకి స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ : మంత్రి సత్యకుమార్ యాదవ్






**కర్నూలు పెన్ పవర్ ఏప్రిల్ 19 :** అధునాతనమైన వసతులతో కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ అందుబాటు లోకి తెచ్చాం అని రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య,శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన లీనియర్ ఆక్సిల రేటర్, సి.టి.సిములేటర్ యంత్రాలు, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, మెడికల్ అంకాలజీ వార్డు లను రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాన్సర్ ఇన్స్టిట్యూట్ లోని అన్ని వార్డులను పరిశీలించి, దాదాపు రెండు గంటల సమయం పైగా రోగులతో ముచ్చటిస్తూ గడిపారు.

కేన్సర్ నివారణ విభాగము , అత్యవసర విభాగం, మెడికల్ ఆంకాలజీ వార్డ్ లను పరిశీలిస్తూ అక్కడే ఉన్న రోగులు తిప్పమ్మ, రాజేశ్వరి, సుప్రియ, చిన్నప్ప, రాజులతో మాట్లాడుతూ వైద్యం ఏ విధంగా అందుతోంది, డాక్టర్లు బాగానే చూసుకుంటున్నారా, మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని రోగులను అడిగి తెలుసుకున్నారు.. అనంతరం సూపర్ స్పెషాలిటీ లోని కార్డియో థోరాసిక్ వ్యాస్కులర్ సర్జరీ వార్డు ను పరిశీలిస్తూ బై పాస్ సర్జరీ చేయించుకున్న వారితో మాట్లాడుతూ వారి ఫీడ్ బ్యాక్ ను మంత్రి తీసుకున్నారు..రోగులు స్పందిస్తూ, డాక్టర్లు వైద్య సేవలు చాలా బాగా అందిస్తున్నారని, సమస్యలు లేవని చెప్పడంతో మంత్రి సంతోషించారు. అనంతరం

తరువాయి 5లో..

## నీట్ యూజీ పరీక్ష నిర్వహణకు పగడ్బందీగా ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ ఏప్రిల్ 19 :** మే 4వ తేదీన జరిగే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్ ) యూజి పరీక్ష నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బస్టాండ్ సమీపంలో ఉన్న గవర్నమెంట్ హై స్కూల్, టేక్కె జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తదితర కళాశాలల గదులను పరిశీలించారు. డీఈవో జనార్దన్ రెడ్డి, నీట్ అబ్జర్వర్ సత్యనారాయణ, ఆర్డీవో విశ్వనాథ్ తదితరులు

తరువాయి 4లో..

# స్వచ్ఛ ఆంధ్ర... స్వచ్ఛ తిరుమల

### - భక్తులు వాహనాల నుండి బయటకు చెత్తను విసరడం మానుకోవాలి

### - స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ తిరుమల కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరి



**తిరుమల, పెన్ పవర్ 2025 ఏప్రిల్ 19 :** పవిత్ర పుణ్య క్షేత్రమైన తిరుమలలో భక్తులు తాము ప్రయాణం చేసే వాహనాల నుండి రోడ్లపై చెత్తను విసరడం మానుకోవాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ తిరుమలలో భాగంగా శనివారం ఉదయం మొదటి ఘాట్ రోడ్ లోని కుంకాల పాయింట్ (ఆఖరి మెట్టు) వద్ద ఆయన సిబ్బందితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమం ప్రారంభించారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ తిరుమలలో భాగంగా మొదటి ఘాట్ రోడ్డులో ఈ చెత్తను తొలగించాలని నిర్ణయించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 400 మంది టీటీడీ సిబ్బందితో పాటు పోలీసులు, తిరుమల స్థానికులు స్వచ్ఛందంగా వచ్చి ఈ కార్యక్రమంలో భాగమయ్యారని చెప్పారు. తిరుమలను పరిశుభ్రంగా ఉంచేందుకు 6వేల మంది సిబ్బంది నిరంతరాయంగా కృషి చేస్తున్నారన్నారు. వారి కృషిని, తిరుమల పవిత్రతను దృష్టిలో ఉంచుకుని వాహనాల నుండి బయటకు చెత్త విసరడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. భక్తులందరూ ఈ విషయాన్ని గుర్తుంచుకుని, స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ తిరుమల కార్యక్రమానికి సహకరించాలని కోరారు. అనంతరం ఆయన ఈ సందర్భంగా దిగువ ఘాట్ మార్గంలో ఎనిమిది ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెత్త తొలిగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈవో రాజేంద్ర, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, వీజీవోలు శ్రీ సురేంద్ర, సదాలక్ష్మీ, ఇతర పోలీసు అధికారులు, పలు శ్రీవారి సేవకులు, విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.



## కడప కోర్టు ఆవరణంలో "క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రామ్"



**కడప పెన్ పవర్ ఏప్రిల్ 19 :** హైకోర్టు ఆదేశానుసారంగా కడప కోర్టు ఆవరణంలో ఎల్.వెంకటేశ్వరరావు కడప మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మరియు ఫుల్ అడిషనల్ చార్జ్ చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారు క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రాము‌ను నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా న్యాయమూర్తులు, న్యాయశాఖ ఉద్యోగులు కోర్ట్ ఆవరణమును మరియు కోర్టు పరిసరాలను క్లీన్ అండ్ గ్రీన్ చేసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప, సీనియర్ సివిల్ జడ్జ్ కే.ప్రత్యూష కుమారి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తానా, ఎక్సైజ్ కోర్టు జడ్జ్ జె.హేమ స్రవంతి, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ జి.విజయలక్ష్మి, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ మీటింగ్






**కడప పెన్ పవర్ ఏప్రిల్ 19 :** ఎల్.వెంకటేశ్వరరావు కడప మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మరియు ఫుల్ అడిషనల్ చార్జ్ చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-మరియు-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారు న్యాయ సేవా సదన్ కడప నందు ఉమ్మడి జిల్లా పోలీస్ అధికారులతో ముందస్తు జాతీయ లోక్ అదాలత్ మీటింగ్ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 10-05-2025వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలని అన్నారు. పోలీస్ స్టేషన్‌ల వారిగా కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట అడిషనల్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ రామ్నాథ్ హెగ్డే, కడప అడిషనల్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ ప్రకాష్ బాబు, కడప సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వెంకటేశ్వర్లు, మైదుకూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి రాజేంద్రప్రసాద్, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర మరియు స్వచ్ఛ ఆంధ్ర..



**చిత్తూరు, పెన్ పవర్ ఏప్రిల్ 19:** జిల్లా సచివాలయ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ -వ్యర్థాలను సేకరించడం జరిగిందని డిఆర్ఓ కె.మోహన్ కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా సచివాలయం ప్రాంగణంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో డిఆర్ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, అనుపమ, వివిధ సెక్షన్ల పర్యవేక్షకులు, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మూడవ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమ నిర్వహణలో భాగంగా జిల్లా సచివాలయ ప్రాంగణంలో గల జ్యోతి రావు పులే భవన్, వివేకానంద భవన్, అంబేద్కర్ భవన్‌లలో గల కార్యాలయాలలోని ఈ-వ్యర్థాలను సేకరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా డిఆర్ఓ సిబ్బందితో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో కులశేఖర్, సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## క్రిసిటీలోని ఉన్న మౌలిక సదుపాయాల పనుల పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి, పెన్ పవర్ఏప్రిల్ 19 :** బివిఎస్ఆర్ కంపెనీ వాళ్ళు చేపడుతున్న క్రిసిటీ అభివృద్ధి పనుల్లో భాగంగా మౌలిక సదుపాయాల నిర్మాణాలైనా లేఅవుట్లు, రోడ్లు, మంచినీటి ట్యాంకులు, బ్రిడ్జిల పనుల పురోగతిని సమీక్షించారు. ఈ పనులను నిర్దేశిత గడువులోగ పనులు పూర్తి కావాలనీ గుత్తేదారులను, అధికారులను తెలిపారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, గుత్తేదారు గోపాలరెడ్డి, జనరల్ మేనేజర్ చెన్నకేశవులు, తాసిల్దార్ శ్రీనివాసులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్రను ప్రారంభించిన కలెక్టర్ మేయర్, ఎమ్మెల్యేలు





**చిత్తూరు పెన్ పవర్ ఏప్రిల్ 19 :** చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, నగర మేయర్,చిత్తూరు శాసనసభ్యులు చుడా చైర్ పర్సన్‌లు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ నగరాలు...స్వచ్ఛ గ్రామాలు స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి మాసం మూడో శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ మూడో శనివారం ఇ-చెక్ అనే థీమ్‌తో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛంద కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, నగర మేయర్ అముద, చిత్తూరు శాసన సభ్యులు గురజాల జగన్మోహన్,చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, నగర డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్,మాజీ ఎమ్మెల్సీ దొరబాబు,కమిషనర్ నరసింహ ప్రసాద్, ఎంహెచ్ఓ డా.లోకేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఈ-వ్యర్థాల ప్రత్యేక నిర్వహణ కార్యక్రమంలో భాగంగా ఇండ్లు, హాస్పిటల్స్, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థల నుండి ఉత్పన్నమయ్యే కంప్యూటర్లు, టీవీలు, రేడియో, మొబైల్ ఫోన్‌లు, వాషింగ్ మిషన్లు, మైక్రో ఓవెన్లు,సిడి ప్లేయర్లు, ఫ్యాన్లు మొదలగు వస్తువులను పర్యావరణ హితంగా నిర్వహించడం ద్వారా రీసైక్లింగ్ చేయడంపై అవగాహన ప్రదర్శనను నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ-వ్యర్థాల ప్రత్యేక నిర్వహణకు సంబంధించిన ప్రదర్శనను జిల్లా కలెక్టర్, నగర మేయర్ చిత్తూరు శాసనసభ్యులు చుడా చైర్‌పర్సన్‌లు పరిశీలించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా సోపులు, కొబ్బరి నూనె బాటిల్స్‌ను అతిథుల చేతుల మీదుగా అందజేశారు.

### లైంఘిక వేదింపులకు పాల్పడిన ఏ.బి.సి.డబ్ల్యు.ఓ.

## ఇందుకూరి కృష్ణయ్యని సస్పెండ్ చేయాలి?




**తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట పెన్ పవర్ ఏప్రిల్ 19 :** వెనుకబడిన తరగతుల బాలికల వసతిగృహం వార్డెన్ గా పనిచేస్తున్న దంతం కవిత గారిని లైంఘీకంగా వేధిస్తున్న నాయుడుపేట ఏ.బి.సి.డబ్ల్యు.ఓ ఇందుకూరి కృష్ణయ్యని వెంటనే విధుల నుండి తొలగించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాల జయవర్ధన్, ప్రోగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారాయుడు లు డిమాండ్ చేశారు. లైంఘిక వేదింపులకు పాల్పడుతున్న నాయుడుపేట ఏ.బి.సి.డబ్ల్యు.ఓ. ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏ.ఓ) పి.భారతికి ఏ.ఐ.ఎస్.బి, పి.ఎస్.యూ నాయకులు పిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి జిల్లా సూళ్లూరుపేట వెనుకబడిన తరగతుల బాలికల వసతిగృహం వార్డెన్‌గా పనిచేస్తున్న దంతం కవితని లైంఘికంగా లొంగ దీసుకునేందుకు నాయుడుపేట ఏ.బి.సి.డబ్ల్యు.ఓ కృష్ణయ్య తరచుగా కవితకి కాల్ చేస్తూ, మీటింగ్‌లో సైతం ఆమెను ఇబ్బంది పెడుతున్నారని వారు తెలిపారు. అతని వేధింపులను భరించలేక కవిత ఏ.బి.సి.డబ్ల్యు.ఓపై జిల్లా కలెక్టర్‌కి పిర్యాదు చేసిందని వారు తెలిపారు. కవిత దళిత మహిళ అని, ఒంటరిగా వుందని గ్రహించిన సదరు ఏ.బి.సి.డబ్ల్యు.ఓ ఆమెను శారీరకంగా లొంగ దీసుకునేందుకు తరచూ కాల్ చేస్తూ నితో వుండాలనిపిస్తుంది, నాతో రిలేషన్‌లో వుంటే నికు ఏ సమస్య రాకుండా చూసుకుంటాను, లేదంటే నికు ఉద్యోగం లేకుండా చేస్తాను అని బెదిరిస్తూ, నిత్యం వేధిస్తున్నారని దళిత ఉద్యోగిని స్వయాన జిల్లా కలెక్టర్‌కి పిర్యాదు చేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. లైంఘిక ఆరోపణలు వచ్చిన అధికారిపై చర్యలు తీసుకోకుండా అధికారిగా కొనసాగిస్తూ విచారణ జరిపితే బాధితులకు ఏవిధంగా న్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు. కృష్ణయ్య ఏ.బి.సి.డబ్ల్యు.ఓగా కొనసాగుతుండటంతో అతను అధికారులను, వ్యవస్థలను మ్యానేజ్ చేస్తూ, తనకు రాజకీయ అండదండలు ఉన్నాయని ఎవరికి పిర్యాదు చేసిన ఏమి కాదు అని భాహిరంగంగానే చెబుతున్నాడని అందువల్లే విచారణలో జాప్యం జరుగుతుందన్నారు. దళిత ఉద్యోగులకు రక్షణ కల్పించడంలో అధికారులు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందాయని వారు తెలిపారు. దళిత ఉద్యోగుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఏ.బి.సి.డబ్ల్యు.ఓను వెంటనే సస్పెండ్ చేసి అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారుదీ కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.బి రాయలసీమ కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్, పి.ఎస్.యూ నాయకులు గోపిలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర ...స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టి.జి.భరత్






**కర్నూలు పెన్ పవర్ ఏప్రిల్ 19 :** రాష్ట్ర ప్రభుత్వ స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తుంది. ఈ శనివారం ఈ-వ్యర్థాల దుష్ప్రభావాలు, పునర్వినియోగం, వాటి సేకరణకు కౌంటర్లను ఏర్పాటు చేస్తుంది. అందులో భాగంగా స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలో ఈ-చెక్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి సభలో పాల్గొని అనంతరం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీని, ఈ వేస్ట్ వస్తువుల సేకరణ మొబైల్ వాహనాన్ని ప్రారంభించిన పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య,మున్సిపల్ కమీషనర్ ఎస్.రవీంద్రబాబు, తదితరులు.

## ధర్మవరం కునుతూరు అహుడా లేఅవుట్‌ను పరిశీలించిన జాయింట్ కలెక్టర్



**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 19 :** శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం కునుతూరు అహుడా లేఅవుట్‌ను శనివారం అనంతపురం జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రోడ్ మెటల్ పనులకు నాణ్యమైన ఇటుకలు మరియు కాంక్రీటును ఉపయోగించడం చేయాలని, అండర్ డ్రైనేజీ, ప్లాట్‌ఫారమ్, రోడ్లు మరియు ప్లాట్‌ల లెవలింగ్, సిసి రోడ్ల మందం, ప్లాంటేషన్, సెంట్రల్ లైట్లు అహుడా యొక్క ప్రజారోగ్యానికి సంబంధించిన నిబంధనలను అనుసరించాలని ఈఈ, ఏఈలను ఆదేశించారు. అహుడా లేఅవుట్‌లో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. లేఅవుట్‌లో పనులపై వారానికోసారి సమీక్షించడం జరుగుతుందని, పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అహుడా అధికారులు పాల్గొన్నారు.

## కాలుష్య రహిత జిల్లాగా కడప..!




(3వ పేజీ తరువాయి) తదితరులు పాల్గొన్నారు. ఈ మాసంలో "ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్"(ఈ వేస్ట్ రీసైక్లింగ్) అంశంతో పారిశుద్ధ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తొలగించడం ద్వారా.. మన ఇంట్లో స్థలం కలిసి రావడంతో పాటు, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పగలం అన్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ నినాదాన్ని ప్రజల్లోకి ఉధృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డిపివో రాజ్యలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య, ప్రజారోగ్య శాఖల అధికారులు, ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## నీట్ యూజీ పరీక్ష నిర్వహణకు పగడ్బందీగా ఏర్పాట్లు

(3వ పేజీ తరువాయి) కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కళాశాలలోని గదులను పరిశీలిస్తూ మే నాలుగో తేదీన జరిగే నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) యూజీ పరీక్ష నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను సూచించారు. జిల్లాలో దాదాపు 1,170 మంది విద్యార్థులు నీట్ పరీక్షలు రాస్తున్న నేపథ్యంలో పిల్లలకు ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షలు నిర్వహిస్తున్న ప్రతి కళాశాలలో డెస్క్ లు శుభ్రంగా ఉండడంతో పాటు ఒక్కో విద్యార్థికి ఒక్కో డెస్క్ కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా అవసరమైన విద్యుత్ తో పాటు, ఫ్యాన్లు కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో కూల్ వాటర్ ను తప్పనిసరిగా ఉంచాలన్నారు. బాలికలకు, బాలురులకు వేరువేరుగా టాయిలెట్లు ఉండాలని కలెక్టర్ సూచించారు. వికలాంగ అభ్యర్థులకు అనువైన పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు వీల్ చైర్లను కూడా అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో గోడ గడియారాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలకు త్వరగా హాజరయ్యే విద్యార్థులకు బిస్కెట్స్ ఏర్పాటు చేసుకునేందుకు కూడా చర్యలు తీసుకోవాలన్నారు.

## ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉద్యోగాలు

**చిత్తూరు, పెన్ పవర్ ఏప్రిల్ 19 :** జిల్లా కలెక్టరు, చిత్తూరు వారి ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోషణ పదకం ఐసిడిఎస్ ప్రాజెక్టుల యందు ఖాళీగా ఉన్న బ్లాక్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఉద్యోగాలను భర్తీ చేయుట కొరకు ఇది వరకు నిర్వహించిన కంప్యూటరు పరీక్ష నందు అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 22 వ తేది మంగళవారం నాడు కలెక్టరేట్, చిత్తూరు నందు ఉదయం 10 గంటలకు, జిల్లా ఎంపిక కమిటీ ద్వారా మౌఖిక పరీక్షలు నిర్వహించబడునని, ఇంటర్వ్యూ కి హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా తమ యొక్క విద్యార్హతలు, ఉద్యోగ అనుభవం, కుల దృవికరణ, వ్యక్తిగత గుర్తింపు కార్డు లను (ఒరిజినల్) ధృవ పత్రాలలో సకాలంలో ఇంటర్వ్యూకి రావలెనని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారిణి జి.వెంకటేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## శ్రీవారి దర్శన భాగ్యం...

## రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్



**తిరుమల, పెన్ పవర్ 19 :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం, జంగం రాజేంద్రప్రసాద్,బత్తుల రాజేంద్ర ప్రసాద్,కుమారి ఆదిలక్ష్మి త్రిపర్ణలు శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**కొత్తపల్లి/ నంద్యాల పెన్ పవర్, ఏప్రిల్ 19 :** స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని ఎలక్ట్రానిక్ వ్యర్థ పదార్థాలను తొలగించేందుకు తమ వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. కొత్తపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఎలక్ట్రానిక్ వ్యర్థ పదార్థాలను తొలగించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ ఏడాది జనవరి నుండి న్యూ ఇయర్ క్లీన్ చార్ట్ తో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం ప్రారంభించమన్నారు. ప్రతినెలా ఒక థీమ్ తో పరిశుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నామన్నారు. ఫిబ్రవరి మాసంలో సోర్స్ - రిసోర్స్ థీమ్ లో భాగంగా చెత్త నుండి సంపదను సృష్టించే కార్యక్రమం చేపట్టామన్నారు, మార్చి మాసంలో సింగల్ యూస్ ప్లాస్టిక్ - ప్రమోట్ రీ యూజబుల్ కాన్సెప్ట్ తో స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ మాసంలో ఇ చెక్ ద్వారా ఈ వేస్ట్ ను ఏ విధంగా తొలగించాలని ప్రధాన ఉద్దేశంతో కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో భాగంగా "ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్"(ఈ వేస్ట్ రీసైక్లింగ్) అంశంతో పారిశుద్ధ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం సూచించిందని ఈ మేరకు అన్ని కార్యాలయాల్లో పాడైపోయిన పనికిరాని టీవీలు, సెల్ఫోన్ చార్జర్లు, స్పీకర్లు, మౌస్ లు, ప్రింటర్లు, స్కానర్లు, సిపియు, యుపిఎస్, స్టెబిలైజర్ ఇతర కంప్యూటర్ పరికరాల జాబితాను తయారుచేసి ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీసైకిల్, రీయూస్) సెంటర్లకు తరలించి సంబంధిత జాబితాపై రసీదు తీసుకోనేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కలెక్టర్ తెలిపారు. పనికిరాని పరికరాలకు సంబంధిత ఏజెన్సీ వారు వెలకట్టి నగదు మొత్తాన్ని అందజేస్తారన్నారు. ఆర్ఆర్ఆర్ సెంటర్లను ప్రతి మున్సిపల్ కేంద్రంలోనూ ఏర్పాటు చేయడంతో పాటు పదివేల జనాభా దాటిన గ్రామ పంచాయతీలో కూడా ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పదివేల జనాభా దాటిన 11 గ్రామపంచాయతీలు ఉన్నాయని వీటన్నిటిలో కూడా ఆర్ఆర్ఆర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా మొత్తం మీద మొత్తం 17 ఆర్ ఆర్ ఆర్ సెంటర్లు ప్రారంభమవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. మన ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఇంట్లో చెత్తను మురికి కాలువలో, రోడ్లమీద వేసే విధానానికి స్వస్తి పలికి రోడ్లు, కార్యాలయాలు, వైద్యాలయాలు,




ఇతర ప్రభుత్వ సంస్థలన్నీ మనవిగా భావించి పరిశుభ్రంగా ఉంచుకునేందుకు శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ వ్యర్థాల వలన దోమల వ్యాప్తి చెంది మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చికిత్సలకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్న ఆలోచనలు అందరిలో రావాలన్నారు. నేను, నేను వున్న పరిసర ప్రాంతాలు అపరిశుభ్రం చేయకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు పరిశుభ్రతపై ఎప్పటికప్పుడు ఓరియంటేషన్ ఇవ్వాలన్నారు. టాయిలెట్లకు ముందు తర్వాత ఫ్లెష్ చేయడం, భోజనానికి ముందు విద్యార్థులచే పరిశుభ్రంగా చేతులు శుభ్రం చేసుకోవాలన్న పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలన్నారు.

## కర్నూలు అందుబాటులోకి స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ : మంత్రి సత్యకుమార్ యాదవ్



**(3వ పేజీ తరువాయి)** విలేకరులతో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో లేని విధంగా కేన్సర్ ఇన్స్టిట్యూట్ లో 28 కోట్ల రూపాయల విలువ గల అత్యాధునిక లీనియర్ ఆక్సిలరేటర్ ను, దాదాపుగా 2 కోట్ల 50 లక్షల రూపాయలు విలువ చేసే అనేక రోగ నిర్ధారణ పరికరాలను కూడా ప్రారంభించామన్నారు..తద్వారా రాష్ట్రంలో అధునాతమైన క్యాన్సర్ చికిత్స కర్నూలులో అందబోతుందన్నారు. ఇప్పటికే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్య రంగంలో విశిష్టమైన సేవలు అందిస్తోందన్నారు. సర్జికల్ ఆంకాలజీ, జనరల్ ఆంకాలజీ లలో ఊహకు అందని సర్జరీలను వైద్యులు చేశారన్నారు. 14 సంవత్సరాల అమ్మాయికి అత్యాధునిక బ్రెయిన్ సర్జరీ చేశారన్నారు. ఈవిధంగా అత్యాధునిక పద్ధతిలో వైద్యులు అనేక సర్జరీలు చేశారన్నారు. వార్డులను పరిశీలించి రోగులను పరామర్శిస్తున్న సమయంలో వారు వైద్యులు అందిస్తున్న సేవలుపట్ల చాలా సంతృప్తి వ్యక్తం చేశారని మంత్రి పేర్కొన్నారు. వైద్యులు రోగులకు అందిస్తున్న సేవలు చాలా బాగున్నాయని మంత్రి వైద్యులను వైద్య సిబ్బందిని అభినందించారు. ఇదే విధంగా రోగులకు అందించే వైద్య సేవలను కొనసాగించాలని మంత్రి సూచించారు.. రాష్ట్రంలోనే గర్వించదగ్గ వైద్య సంస్థగా, వైద్య కళాశాలగా కర్నూలు ఆస్పత్రిని తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. సంవత్సరం కిందట సమీక్ష నిర్వహించి నప్పుడు వైద్య రంగంలో అనేక కొరతలు కనిపించాయన్నారు.. ప్రధానంగా డాక్టర్ల కొరత ఉండేదని, 40 శాతం డాక్టర్ల కొరత ఉంటే ఇటీవలే రీడిప్లాయిమెంట్ చేయడం జరిగిందన్నారు.. అందులో భాగంగా ఆదోని, ఇతరత్రా ప్రాంతాల నుండి డాక్టర్లను, బోధన సిబ్బందిని కర్నూలుకి తీసుకొని వస్తే కేవలం 6 నుండి 7 శాతం మాత్రమే టీచింగ్ స్టాఫ్ కొరత ఉందన్నారు.. అసిస్టెంట్ ప్రొఫెసర్ లు, కింది స్థాయిలో ఇంకా కొరత ఉందని వాటిని రిక్రూట్మెంట్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.. గత ప్రభుత్వం రిక్రూట్మెంట్ జీరో వేకెన్సీ పాలసీ అని చెప్పారు కానీ సిబ్బంది నియామకంలో చాలా కొరత ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా పటిష్టపరిచే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ విధంగా సేవాభావం అంకితభావం ఉన్న డాక్టర్లు ఉన్నప్పుడు వారిని మోటివేట్ చేసి వారికి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ విషయాలను గత ప్రభుత్వం మరిచినప్పటికీ మన కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైద్య రంగంపై రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు సమీక్షలు నిర్వహించి వైద్యులకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు.. కేంద్ర ప్రభుత్వం నుండి వైద్య రంగానికి సంబంధించి సహాయ సహకారాలు అందుతున్నాయన్నారు.. ప్రత్యేకించి వైద్య రంగానికి 15 వ కమిషన్ కింద నిధులు వస్తున్నాయన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ మిషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కింద కూడా పెద్ద ఎత్తున నిధులు లభిస్తున్నాయన్నారు. కింది స్థాయి పీహెచ్సీ నుండి కూడా వైద్య సేవలు పటిష్టంగా అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్యాన్సర్ ఇన్స్టిట్యూట్లో కేవలం ఆంధ్రప్రదేశ్కి సంబంధించిన రోగులే కాకుండా కర్ణాటక, తెలంగాణ నుండి వచ్చి ట్రీట్మెంట్ తీసుకుంటున్నారని మంత్రి పేర్కొన్నారు.ప్రైవేట్ ఆస్పత్రులలో 20 నుండి 25 లక్షల వరకు అందించే వైద్యాన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా అందిస్తున్నారని విషయాన్ని అదేవిధంగా రోగులను వైద్యులు కుటుంబ సభ్యులుగా చూసుకుంటున్నారని విషయాన్ని ప్రజలలోకి తీసుకొని వెళ్లాల్సిన బాధ్యత మీడియాపై ఉందని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, ఏపీఎంఎస్ఐడిసి చైర్మన్ శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అకడమిక్ డిఎంఈ డా.రఘునందన్, జిజి హెచ్ సూపరింటెండెంట్ డా .వెంకటేశ్వర్లు,మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టి నరసమ్మ, కేన్సర్ ఇన్స్టిట్యూట్ వైద్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నెట్ సెంటర్లో నీలి చిత్రాల ప్రదర్శన.. మహిళ ఫిర్యాదు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 19 :** శ్రీకాళహస్తి పట్టణం బలరాం థియేటర్ వీధిలో ఓ నెట్ సెంటర్లో నీలి చిత్రాలు ప్రదర్శిస్తుండడంతో మహిళా 100కు ఫిర్యాదు చేసి పోలీసులకు పట్టించింది. శుక్రవారం పట్టణానికి చెందిన ఓ మహిళా జిరాక్స్ కోసం ఓ నెట్ సెంటర్ వద్దకు వెళ్లగా బ్లూ ఫిలిం ప్రదర్శిస్తుండడంతో ఇదేమిటని ప్రశ్నించిన ఆమెపై నిర్వాహకులు అసభ్యకరంగా మాట్లాడారు. దీంతో ఆమె 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. పోలీసులు నిర్వాహకులను అదుపులో తీసుకున్నారు.

## జీవన నైపుణ్యాలు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 19 :** ఎర్రగుడిపాడులో నేతాజీ బాలలు విద్యార్థి సంఘం విద్యార్థులకు యువతకు జీవన నైపుణ్యాలు కమ్యూనికేషన్ స్కిల్స్ విశ్లేషణాత్మక నైపుణ్యాలు సృజనాత్మకత లక్ష్యాలు సంఘర్షణ పరిష్కారం నైపుణ్యాలు లక్ష్యం ఏర్పాటు సమస్యలు ఏర్పడినప్పుడు పరిష్కరించుకునే విధానాలుపై ప్రగతి సంస్థ అవగాహన కల్పించారు. విద్యార్థులకు గ్రామీణ యువతకు ప్రగతి సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నారాయణ శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకుని భవిష్యత్తుపై తమ లక్ష్యాలను వ్యక్తపరిచారు. బోర్డుపై చిత్రాలు ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసు కున్నారు. ఈ కార్యక్రమంలో బాల సంఘాలు విద్యార్థులు గ్రామీణ యువత ప్రగతి సంస్థ శ్రీకాళహస్తి సమన్వయకర్త చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## బనగానపల్లెలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సుడిగాలి పర్యటన





**బనగానపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 19 :** బనగానపల్లె పట్టణంలో రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. బనగానపల్లె పట్టణంలో నిర్మాణం ఉన్న పలు సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. బనగానపల్లె పట్టణం వ్యాప్తంగా నిర్మాణం చేపట్టిన ఆయా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి.. ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని అధికారులు ఆదేశించారు. బనగానపల్లె పట్టణంలోని 4 రోడ్ల కూడళ్లను ఆర్కిటెక్చర్ల సూచన మేరకు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. బనగానపల్లెలో నాలుగు రోడ్ల కూడళ్లను ట్రాఫిక్ సమస్య లేకుండా విస్తరించేందుకు.. స్వాగత ద్వారాలు నిర్మించేందుకు ప్రభుత్వ ఆర్కిటెక్చర్లతో మంత్రి చర్చించారు.

## టిటిడి గోశాలలో గోవులకు పెట్టే గడ్డిని కూడా గత పాలకులు వదలలేదు : టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు





**తిరుమల, పెన్ పవర్ ఏప్రిల్ 19 :** టిటిడి గోశాలలో గోవులకు పెట్టే గడ్డిని కూడా గత పాలకులు వదలలేదని టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడారు. టిటిడి గోశాలలో ఆల్ ఇండియా గోసంరక్షణ సంస్థ ప్రధాన కార్యదర్శి, టిటిడి గోసంరక్షణ పూర్వ సభ్యులు కోటి శ్రీధర్, టిటిడి బోర్డు సభ్యులు, మీడియాతో కలిసి చైర్మన్ శనివారం పరిశీలించారు. ప్రస్తుతం గోవులకు అందుతున్న దాణా, త్రాగునీరు, పరిశుభ్రత, అవసరమైన వైద్యం జరుగుతుందా తదితర అంశాలను గోశాల ఇంఛార్జి డైరెక్టర్ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. గోశాలలో గోవులు, పేయ దూడలు ఉంటున్న షెడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టిటిడి గోశాలపై కోర్టుల్లో పిల్స్ దాఖలు చేస్తామని కొంత మంది ఫోన్ లు చేస్తున్నారని, వారిని ఒకటే కోరుతున్నా, గత ఐదేళ్ల పాలనలో టిటిడిలో జరిగిన నిధుల స్వాహా, అవకతవకల అంశాలను జోడించి కోర్టుల్లో కేసులు దాఖలు చేస్తే వారికి పూర్తి సహకారం అందిస్తామని చైర్మన్ చెప్పారు. గతంలో పింక్ డైమండ్ మీద కోర్టులో కేసు వేశారని, ఆ కేసు ఏమైందని ప్రశ్నించారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక టిటిడిలో ఎలాంటి అవినీతి జరుగలేదని తాను హామీ ఇస్తున్నానని చెప్పారు. టిటిడిలో గత 10 నెలల్లో ఏమి జరుగక పోయినా ఏదో జరిగిపోతున్నట్లు కొంత మంది ఉద్దేశ్యపూర్వకంగా చేస్తున్న గ్లోబల్ ప్రచారం, డైవర్షన్ పాలిటిక్స్ చేయడం సరికాదని సూచించారు. 2023-24 ఏడాదిలో అప్పట్లో టిటిడి గోసంరక్షణ సలహాదారు శ్రీ కోటి శ్రీధర్ చెప్పిన మాటలను చూస్తుంటే , టిటిడి గోశాలలో జరిగిన అవకతవకలపై మాకు తెలిసింది కొంతే, ఇంకా చాలా ఉందని చెప్పారు. టిటిడి గోశాల గోవులను కూడా ఒంగోలులో అమ్ముకున్నట్లు తెలుస్తోందన్నారు. గతంలో టిటిడి గోశాల సంచాలకులుగా పనిచేసిన డా. హరినాథ్ రెడ్డి టిటిడి గోశాలను సొంత ఎస్టేట్ లాగా భావించి భారీ అవకతవకలకు పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. ఎవరిని గోశాలలోకి రానివ్వకుండా హరినాథ్ రెడ్డి నియంతృత్వంగా వ్యవహరించారన్నారు. వైద్యులను, ఇతరులను గోశాలకు రానివ్వకుండా వేధించారణే ఆరోపణలు ఉన్నాయన్నారు. టిటిడిలో జరిగిన పలు అవకతవకలపై అవసరమైతే ఏసీబీ విచారణ కోరుతామని చైర్మన్ మాట్లాడారు. ఈ సందర్భంగా టిటిడి బోర్డు సభ్యులు జి. ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, టిటిడి గోశాలలో గోవుల సహజ మరణాలపై అసత్య ప్రచారం చేసి, టిటిడి ప్రతిష్టతను పలుచన చేస్తున్న టిటిడి పూర్వ చైర్మన్ శ్రీ బి కరుణాకర్ రెడ్డిపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టామని, వాటికి సంబంధించిన పూర్తి వివరాలు తమ దగ్గర ఉన్నాయన్నారు. చట్టాలనుండి తప్పించుకోలేరని మాట్లాడారు. టిటిడి గోశాలలో గత పాలకుల పాలనలో ఉన్న పూర్వ సంచాలకులు డాక్టర్ హరినాథ్ రెడ్డి పలు అక్రమాలకు పాల్పడ్డారని గతంలో గోశాల సంరక్షణ సభ్యులుగా పనిచేసిన శ్రీ కోటి శ్రీధర్ ఆరోపించారు. మందులు, గడ్డి, ఇతర రాష్ట్రాల నుండి గోవుల కొనుగోలులో భారీగా అవకతవకలు, గోవులు ప్రసవం అయ్యాక గోవులు ఏమయ్యాయో పూర్తి స్థాయిలో లెక్కలు లేవని ఆయన ఆరోపించారు. టిటిడి గోశాలను వివాదం చేయవద్దని ఆయన కోరారు. ఈ సమావేశంలో టిటిడి బోర్డు సభ్యులు జి.భానుప్రకాశ్ రెడ్డి, శాంతా రామ్, నరేష్ కుమార్, ఆల్ ఇండియా గోసంరక్షణ జనరల్ సెక్రటరీ కోటి శ్రీధర్ పాల్గొన్నారు.

## సూపర్ స్పెషాలిటీ వైద్యశాల వైద్యులు, సిబ్బందితో మంత్రి సమీక్ష







కర్నూలు పెన్ పవర్ ఏప్రిల్ 19 : జిజిహెచ్‌లో మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథితో కలసి సూపర్ స్పెషాలిటీ వైద్యశాల వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించిన మంత్రి సత్యకుమార్ యాదవ్. సిబ్బంది కొరత ప్రభావం పడనీయకుండా ఆస్పత్రిలో అన్ని రకాల వైద్యసేవలను అందిస్తున్న వైద్యులకు అభినందనలు తెలిపారు. అలాగే ఆస్పత్రిలో హార్ట్ ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్సలను కూడా అందించేలా చూడాలన్నారు. పేషెంట్లకు, వారి సహాయకులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలతోపాటు 30 అంశాల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జీజీహెచ్‌లో అవసరమైన ఐపీ బ్లాక్ నిర్మిస్తామన్నారు. నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ బ్లాక్‌ను త్వరలోనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అలాగే ఆదోని మెడికల్ కాలేజీని అన్ని వసతులతో వచ్చే ఏడాది అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

## ఇంటర్‌లో సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ గర్వకారణం : కలెక్టర్





**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 19 :** ఇంటర్మీడియట్ లో సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి 900 కు పైగా మార్కులు సాధించడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదివి 900 పైగా మార్కులు తెచ్చుకున్న ఇంటర్మీడియట్ విద్యార్థినీవిద్యార్థులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థినీ విద్యార్థులు 18 మంది 900 కు పైగా మార్కులు తెచ్చుకోవడం పట్ల అభినందనలు తెలిపారు. ఇంటర్ లో సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు అత్యధిక మార్కుల తెచ్చుకున్న జిల్లాలలో ప్రకాశం జిల్లా నుంచి 28 మంది విద్యార్థులు 900 కు పైగా మార్కులు తెచ్చుకుని రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలువగా, అనంతపురం జిల్లా నుంచి 18 మంది విద్యార్థులు 900 పైగా మార్కులు తెచ్చుకొని రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలవడం పట్ల సంతోషంగా ఉందన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులంతా ఎంతో శ్రమపడి కష్టపడి చదివి రాష్ట్రస్థాయిలో రెండవ స్థానంలో నిలవడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో బాగా చదువుకోవాలని సూచించారు. ఎంతవరకు చదువుకోవాలనుకుంటున్నారో అంతవరకు బాగా చదువుకొని మంచి ఉద్యోగం చేయాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు పాడడం, ఇతర యాక్టివిటీలలో పాల్గొనాలన్నారు. చదవడానికి ఆర్థిక స్తోమత లేదని సహాయం కావాలని ఎవరైనా అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని, వారిని ఎక్కడ దాకా చదవాలని అనుకుంటున్నారో అక్కడ వరకు చదివిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు శాలువా కప్పి, షీల్డ్, సర్టిఫికెట్ అందజేసి జిల్లా కలెక్టర్ సన్మానించారు. బి.హేమలత ఆప్తల్మిక్ టెక్నీషియన్ లో 905 మార్కులతో స్టేట్ ఫస్ట్ రావడంతో మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ల్యాప్ టాప్ అనుకోవడం పట్ల విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

## ఆడ పిల్లలు పుట్టారని భార్యపై దాడి



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 19 :** శ్రీకాళహస్తి కైలాసగిరికి చెందిన దామోదర్ నాయుడు 3వ కుమార్తె కోమలపై ఆమె భర్త తారక రామ్ శుక్రవారం దాడి చేశాడు. బాధితుల సమాచారం మేరకు.. బోనుపల్లికి చెందిన తారక రామ్కు మూడేళ్ల క్రితం కోమలతో వివాహమైంది. వారికి తొలి కాన్పులో అమ్మాయి పుట్టింది. 4 నెలల క్రితం కవలలుగా ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. దీంతో ఆయన మరో వైపు మహిళతో సన్నిహితంగా ఉండగా కోమల ప్రశ్నించింది. ప్రశ్నించిన భార్యను, మామను నిందితుడు చితకబాదాడు.

## దేశంలో ముస్లింలకు అన్యాయం చేసే వాక్ఫ్ సవరణ చట్టాన్ని మరియు నల్ల చట్టాన్ని రద్దు చేయాలి



**శ్రీ కాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 19 :** శనివారం శ్రీకాళహస్తి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ కూడలి దగ్గర అంబేద్కర్ విగ్రహానికి వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేసిన వామపక్ష ప్రతిపక్ష పార్టీలు. ముస్లిం నాయకులు అంబేద్కర్, రాజ్యాన్ని గంగలో కలుపుతున్నారని దేశంలో ముస్లింలకు రక్షణ లేకుండా పోయే పరిస్థితి వస్తుందని ఇకనైనా దేశంలో ముస్లింలు దళితులు అంతా ఐక్యంగా నల్ల చట్టాల రద్దయి వరకు పోరాడాలని కోరారు. తిరుపతి జిల్లా మాజీ వాక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ సిరాజ్ భాష. శ్రీకాళహస్తి నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ ఫరీద్ ఖాన్ పట్టణ అధ్యక్షులు మహబూబ్ బాషా, గోరా, యాంటీ కరప్షన్ జిల్లా అధ్యక్షులు లాలు, మైనార్టీ నాయకులు షేక్ అస్లాం. లాల్ బాషా. మీర్జాన్ సా. షేక్ జూమ్లేష. ఆరిఫ్. సునీల్. షర్మిల ఠాగూర్. నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామి వెంకటేశ్వర్లు. పసల కిష్టయ్య. సిపిఎం సిపిఐ నాయకులు. పుల్లయ్య గంధపు మని గురవయ్య గురునాథ్. అన్వర్ భాష. క్రైస్తవ బోధకుడు అసోసియేషన్ నాయకులు జీవమని ప్రెసిడెంట్ ఆమ్రోస్ రవి దాని జాన్ పీటర్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు డేవిడ్.పాల్. లాజర్ కొండయ్య శ్యామల రావు తదితరులు పాల్గొన్నారు.

## పలమనేరు ఆర్‌డిఓ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణ : కలెక్టర్



**చిత్తూరు,ఏప్రిల్ 19 :** ఏప్రిల్ 21 న సోమవారం పలమనేరు ఆర్‌డిఓ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను ఉ.9.30 గం.ల నుండి మ.1 గం.వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలమనేరు రెవిన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల కొరకు ప్రత్యేకంగా ఏప్రిల్ 21న సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు. ప్రతి సోమవారం చిత్తూరు జిల్లా కేంద్రంలో జరుగు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం యధావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## పీపుల్ అవేర్నెస్ అభియాన్ : బిజెపి అధ్యక్షులు జీవీ సుబ్బారెడ్డి



**కడప పెన్ పవర్ ఏప్రిల్ 19 :** అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర పార్టీ సూచనల మేరకు "పీపుల్ అవేర్నెస్ అభియాన్" కార్యక్రమం రాబోవు ఆదివారం నాడు ( 21/ 04/25) జరగనుంది. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు రవిచంద్ర రెడ్డి సందిరెడ్డి శ్రీనివాసులు గారు ముఖ్య అతిధులుగా, వక్తలుగా విచ్చేస్తున్నారు. కావున మన భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరు విరివిగా పాల్గొనవలసిందిగా మనవి. స్థలం: బీరం శ్రీధర్ రెడ్డి ఇంటర్నేషనల్ విద్యాసంస్థలు, ఖాజిపేట మండలం. సమయం: ఉ 10:00 గంటలకు.

## ఇబ్బంది పెడితే కూటమినేతలనూ ఉపేక్షించను



### డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**అమరావతి పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 19 :** ఏపీ అధికారులతో టెలికాన్ఫరెన్స్ లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. "త్వరలో జిల్లాల పర్యటనకు వెళ్తా. భూదందాల బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తా. ఫిర్యాదులను స్వయంగా పరిశీలిస్తా. కూటమి పాలన పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగుతోంది. ప్రజలను ఇబ్బందిపెడితే కూటమినేతలనూ ఉపేక్షించను" అని హెచ్చరించారు.

## స్వర్ణాంధ్ర ... స్వచ్ఛ ఆంధ్ర ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి : డిఆర్ఓ నరసింహులు





**తిరుపతి, పెన్ పవర్ ఏప్రిల్ 19 :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతినెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందనీ ప్రతి ఒక్కరు భాగస్వామ్యంతో కావాలని డిఆర్ఓ నరసింహులు తెలిపారు. శనివారం ఉదయము స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరము నందు డిఆర్ఓ నరసింహులు కలెక్టర్ లోని జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బందితో కలిసి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. డిఆర్ఓ మాట్లాడుతూ..స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం పై ప్రతి ఒక్కరు కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ నెల మూడవ శనివారం ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ అనే ప్రధాన అంశంతో ఈరోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కలెక్టరేట్లోని ప్రతి కార్యాలయంలో అన్ని పరిసరాలను, ఫైలును పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ వేస్ట్ సేకరణ (ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ) ప్రధానాంశం అని తెలిపారు. అన్ని కార్యాలయాల్లో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను, చెత్త,ఇతర వ్యర్థాలను రీసైక్లింగ్ చేయాలి అని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతను పాటించే విషయంలో అందరు భాగస్వాములు కావాలని తెలిపారు. జిల్లా అధికారులు సిబ్బంది తో కలిసి డిఆర్ఓ స్వచ్ఛంద గురించి అందరూ చేత ప్రతిజ్ఞ చేయించారు.

### జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబర్చిన వారికి

## మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అభినందనలు

**అమరావతి పెన్ పవర్ ఏప్రిల్ 19 :** జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబర్చిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అభినందనలు తెలిపారు. నంద్యాల జిల్లా జుపాడు బంగ్లా మండలంలో తాటిపాడు గ్రామానికి చెందిన వంగల అజయ్ రెడ్డి ఇడబ్ల్యుఎస్ విభాగంలో జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు దక్కించుకోవడంపై మంరతి ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ లో చదువుకుంటున్న నంద్యాల జిల్లాకు చెందిన వంగల అజయ్ రెడ్డి ప్రతిష్టాత్మకమైన జేఈఈ మెయిన్స్ జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవడం నంద్యాల జిల్లాకే గర్వకారణమన్న మంత్రి.. అజయ్ రెడ్డి భవిష్యత్తులో మరింత గొప్పగా చదువులో రాణించి నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్ కు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని మంత్రి ఆకాంక్షించారు. ఏపీ నుంచి 100 పర్సంటైల్ స్కోర్ సాధించిన సాయి మనోజ్ఞ గుత్తికొండకు కూడా ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## మైనారిటీ సంక్షేమ అధికారిగా షేక్ హిదాయతుల్లా



**కడప, పెన్ పవర్ ఏప్రిల్ 19 :** వైయస్సార్ కడప ఉమ్మడి జిల్లాల మైనారిటీ సంక్షేమ అధికారిగా షేక్ హిదాయతుల్లా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాల మైనారిటీ సంక్షేమ అధికారిగా నియమితులైన ఆయన శనివారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి గారిని మర్యాద పూర్వకంగా కలిసిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు, యువత, విద్యార్థులు, వ్యాపారులు వంటి అన్ని మైనారిటీ వర్గాల అభివృద్ధికి "ప్రభుత్వం చేపడుతున్న మైనారిటీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా ప్రతి అర్హులైన వ్యక్తికి చేరేలా పని చేస్తానని తెలిపారు ప్రజలకు సేవ చేయడం నా ప్రథమ కర్తవ్యం" అని తెలిపారు మైనారిటీ విద్యార్థులకు విద్యావేతనాలు, ఉపకారవేతనాలు, వృత్తిపరమైన శిక్షణలు, మైనారిటీ మహిళల ఆర్థిక అభివృద్ధి తదితర పథకాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని మైనారిటీ వర్గాలకు పునాదిస్థాయిలో సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు మైనారిటీ సంక్షేమ శాఖతో ఏవైనా సమస్యలు లేదా సమాచారం కోసం జిల్లా కలెక్టరేట్లో ఉన్న తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు.

## టీటీడీ గోశాల మాజీ డైరెక్టర్‌పై చర్యలు తప్పవు : బీఆర్ నాయుడు



**ఆంధ్రప్రదేశ్, పెన్ పవర్ ఏప్రిల్ 19 :** టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు శనివారం తిరుపతిలో టీటీడీ గోసంరక్షణశాలను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో గోవుల గడ్డిని కూడా తినేశారు. "గోశాలలోని గోవులను ఒంగోలుకు తరలించి కమీషన్లకు అమ్మేశారని ఆయన మండిపడ్డారు. గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డి అక్రమాలు అన్నీఇన్నీ కావన్నారు. ఆయన బాగోతం బయటపడుతుందని రికార్డులు ఎత్తుకెళ్లారని విమర్శించారు. ఆయనపై కచ్చితంగా చర్యలు ఉంటాయి" అని బీఆర్ నాయుడు పేర్కొన్నారు.

## 27న కవనవిజయం సాహిత్య రూపకం ప్రదర్శన

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 19 :** చీరాల కళాంజలి వారి ఆధ్వర్యంలో జాతీయ నాటకోత్సవాల ప్రదర్శనలు ఏర్పాటులో భాగంగా కల్పనాకర్త దివంగత డా.నాగభైరవ కోటేశ్వరరావు విరచిత కవనవిజయం సాహిత్య రూపకం 525 వ ప్రదర్శన ఈనెల 27 వతేదీన సాయంత్రం 7 గంటలకు చీరాలలోని కె.జి.యం హైస్కూల్ ఆవరణలో, వాసుదేవ విలాస్ సెంటర్ నందు జరుగుతోందని నిర్వాహకులు నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ,బత్తుల బ్రహ్మారెడ్డిలు ఒక ప్రకటనలో తెలియజేశారు. డా.నాగభైరవ ఆదినారాయణ నేతృత్వంలో జరిగే ఈ ప్రదర్శనలో ప్రయోక్తగా కళారత్న డా.భూసురపల్లి వెంకటేశ్వర్లు,ప్రబంధకవిగా సిహెచ్ ఏడుకొండలు, భావకవిగా నట్టే ప్రసాద్, అభ్యుదయకవిగా కప్పగంతు జయరామయ్య, వలా రచయిత్రిగా ఈదుమూడి జయంతి,స్త్రీవాద కవయిత్రిగా తేళ్ళఅరుణ,ప్రజా కవిగా నూకతోటి శరత్ బాబు, క్లార్క్ సూర్యారావుగా బత్తుల బ్రహ్మారెడ్డి తదితరులు పాత్రధారులుగా ఉంటారని తెలిపారు.

# వివిధ ఆరోగ్య విభాగాలను ప్రారంభోత్సవం చేసిన రాష్ట్ర మంత్రులు సత్య కుమార్ యాదవ్, టీ.జీ.భరత్







**కర్నూలు పెన్ పవర్ ఏప్రిల్ 19 :** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన లీనియర్ ఆక్సిలరేటర్, సి.టి.సిములేటర్ యంత్రాలు, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, మెడికల్ అంకాలజీ వార్డులను ప్రారంభించిన వైద్య విద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్.

## స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ముందు వరుసలో నిలుద్దాం : కలెక్టర్

- 75 ఏళ్లలో 25 ఏళ్ల యువకుడిలా చంద్రబాబు ఆలోచనలు.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- ప్రజల సహకారంతోనే స్వచ్ఛ అనంత సాధ్యం : ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ
- నగరంలో ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ



**పెన్ పవర్ అనంతపురం ఏప్రిల్ 19 :** ఈ-వేస్ట్ సేకరణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ముందు వరుసలో నిలుద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి పిలుపునిచ్చారు. ప్రతి నెల 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నగరంలో పెద్ద ఎత్తు చేపట్టగా, ముందుగా నగరంలో స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, తదితరులు నివాళులర్పించి.. మానవహారంగా ఏర్పడి స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్‌కు సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు. ఆ తర్వాత నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈవేస్ట్ సేకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అక్కడే మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం బాగా పెరిగిందని.. అయితే అందులో మరమ్మతులు వచ్చిన వాటిని వృథాగా పడేస్తున్నారన్నారు. ఇలాంటి వస్తువుల్ని సేకరించి.. వాటిలో విలువైన పరికరాల్ని మళ్లీ ఉపయోగించేలా ఈ-వేస్ట్ సేకరణ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్టు తెలిపారు. దీనిపై ఎస్.ఎస్.జిలు, సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఫిబ్రవరి నెలలో 2వ స్థానంలో, మార్చి నెలలో 7వ స్థానంలో నిలిచామన్నారు. వచ్చే నెలలో మొదటి స్థానంలో ఉండేలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పట్టణ ప్రాంతాల్లో కూడా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో అన్ని ప్రాంతాల ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే ప్రతి మండల కేంద్రంలో, 10 వేల జనాభా ఉన్న పంచాయతీ కేంద్రాల్లో ఈ వేస్ట్ సేకరణ కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. రానున్న రోజుల్లో ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయాలు చేసే దుకాణాలు, మరమ్మతు కేంద్రాల నుంచి ఈ వేస్ట్ సేకరిస్తామన్నారు. వీటిన్నింటినీ హిందూపురం ప్రాంతంలోని ఒక కంపెనీకి తరలిస్తున్నట్టు చెప్పారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఈ వేస్ట్ సేకరించాలన్న ఆలోచన గతంలో ఎవరికి రాలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో వినూత్నంగా ఆలోచించి.. 75 ఏళ్లలో కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు... 25 ఏళ్ల యువకుడిలా ఆలోచిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆర్ఆర్ఆర్ విధానంలో తీసుకెళున్నారన్నారు. రీసైకిల్, రీ ప్రాసెస్, రీ యూజ్ విధానాన్ని ఆయన చేపడుతున్నారన్నారు. దీనిపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో అనంతపురం గతంలో రెండు మూడు స్థానాల్లో నిలిచిందని... ఇప్పుడు మొదటి స్థానంలో నిలిచేందుకు.. ప్రతి



ఒక్కరి సహకారం అవసరమన్నారు. కేవలం మున్సిపల్ సిబ్బంది మాత్రమే శ్రమిస్తే సరిపోదని... దీనికి ప్రజల భాగస్వామ్యం కూడా ఉండాలన్నారు. గతంకి ఇప్పటికీ నగరంలో చాలా తేడా కనిపిస్తోందన్నారు. ఇప్పటికే 40 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చెపట్టినట్లు తెలిపారు. త్వరలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వంకలకు ప్రొటెక్షన్ వాల్స్ వస్తాయన్నారు. అక్టోబర్ 2 నాటికి డంపింగ్ యార్డ్ లో చెత్త లేకుండా చేస్తామని... డంపింగ్ యార్డ్ ను మరోచోటికి తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి వినూత్నంగా ఆలోచించి ఈ వేస్ట్ సేకరణ చేపట్టారన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన అవసరమన్నారు. ప్రజల సహకారం ఉంటేనే స్వచ్ఛ అనంతను మనం చూడగలుగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, నగరపాలక సంస్థ కమిషనర్ బాలరాజు, డిపిఓ నాగరాజు నాయుడు, జడ్పి సిఈఓ రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఆర్డీ, కార్పొరేటర్ లు, తదితరులు పాల్గొన్నారు.

## ధర్తి ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం



### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి

**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 19 :** ధర్తి ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద ఆయా గ్రామాల్లో త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ధర్తి ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద డిఎల్సి సమావేశాన్ని జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధర్తి ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కింద ఆయా శాఖల పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను అందజేయాలన్నారు. గుంతకల్లు మండలం గుండాల తాండా, వజ్రకరూరు మండలం వెంకటపల్లి పెద్ద తాండా, వెంకటంపల్లి చిన్న తాండా, సింగనమల మండలం నాగులగుడ్డం తాండాలలో ధర్తి ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కింద పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో పిఎంఏవై పథకం కింద గృహాల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని, పంచాయతీ రాజ్ కింద ఆయా గ్రామాల్లో సిసి రోడ్లను గుర్తించి ఉపాధి హామీ కింద అంచనాలను తయారు చేసి ఆమోదం తీసుకోవాలని, విద్యుత్ శాఖ కింద గిరిజన కుటుంబాలకు రూఫ్ టాప్ క్రింద సోలార్ తో విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేసుకోవాలని, ఆయా గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ క్రింద మంజూరైన పనులను ప్రారంభించి పూర్తి చేయాలని, అమెనియా టెస్ట్ లు పూర్తి కాని వారికి కిట్స్ సరిఫరా చేసిన వెంటనే స్క్రీనింగ్ టెస్ట్ చేపట్టాలన్నారు. ఆయా గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ కార్డులు పెండింగ్ లేకుండా పంపిణీ చేయాలన్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల్ యోజన పథకం కింద అర్హతలతో గుర్తించ బడిన వారికి గ్యాస్ కనెక్షన్ మంజూరు చేయాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవనాలు, పాఠశాల భవనాలకు మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని, ఆయా గ్రామాల్లో సుస్థిర వ్యవసాయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని,



ఆయా గ్రామాల్లో ఎన్ఎల్ఎం, పిఎంఈజిపి కింద గిరిజన లబ్ధిదారులకు గొర్రెలు మరియు మేకల పెంపకం కోసం బ్యాంకు వారి సహకారంతో రుణాలు మంజూరు చేయాలని, నిరుద్యోగ యువతీ యువకులకు టైలరింగ్, కంప్యూటర్ బేసిక్ మరియు ఎలక్ట్రీషియన్, సంబంధిత శిక్షణ ఇవ్వాలని, ఆయా శాఖల కింద చేపట్టబోయే కార్యక్రమాలకు సంబంధించిన ప్రతిపాదనలు త్వరితగతిన పంపించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, డిటిడబ్ల్యుఓ రామాంజనేయులు, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, డిపిఓ నాగరాజు నాయుడు, జడ్పి సిఈఓ రామచంద్రారెడ్డి, ఐసిడిఎస్ పిడి జయలక్ష్మి, పిఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాప్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి జయకుమార్ బాబు, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా దిష్టి బొమ్మకి చొప్పుల మాల వేసి, దిష్టి బొమ్మ దగ్ధం చేసిన శ్రీకాళహస్తి జనసేన ఇంఛార్జి వినుత కోటా



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 19 :** మొన్న తిరుపతిలో మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్, వారి అబ్బాయిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ఈరోజు శ్రీకాళహస్తి పట్టణం లోని పెళ్లి మండపం సెంటర్‌లో జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి శ్రీమతి వినుత కోటా, రోజా దిష్టి బొమ్మ కి చొప్పుల మాల వేసి, ప్యాకేజ్ అన్నందుకు రోజా దిష్టి బొమ్మని చొప్పుతో కొట్టి, దిష్టి బొమ్మ దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. రోజా కబడ్దార్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజాకి నగిరి ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా బుద్ధి రాలేదని, నోటికి వచ్చినట్టు పవన్ కళ్యాణ్, గురించి పదే పదే వాగడం సరికాదని హెచ్చరించారు. రోజాని ప్రజలు మరిచిపోయారని, ఎలాగైనా లైమ్ లైట్ లో ఉండడానికి ప్రయత్నిస్తూ ఇలాంటి చిల్లర మాటలు పవన్ కళ్యాణ్, ఉద్దేశించి చేస్తుందని మండి పడ్డారు. ఎంత ప్యాకేజ్ తీసుకుని పవన్ కళ్యాణ్ ,గురించి చిల్లర మాటలు మాట్లాడుతున్నావని ఎగ్దేవా చేశారు. ఇప్పటికీ దిష్టి బొమ్మ దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేస్తున్నానని, మరొక్క సారి పవన్ కళ్యాణ్ ,పైన నిరాధార ఆరోపణలు చేసి, చిల్లర గా మాట్లాడితే నగిరి లో రోజా ఇంటి ని ముట్టడించి అక్కడే బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వీర మహిళలు, నాయకులు కావలి శివకుమార్, పేట చంద్రశేఖర్, తోట గణేష్, చిన్న తోటి నాగరాజు, చంద్ర శేఖర్ రావు, లక్ష్మి, రాజ్య లక్ష్మి, నితీష్, వెంకట రమణ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, శీను, వినోద్, లక్ష్మణ్, మహేష్, సురేష్, దుమ్ము, దినేష్ తదితరులు పెద్ద ఎత్తున నాయకులు పాల్గొన్నారు.

## గోవుల సంరక్షణ అందరి బాధ్యత

### జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి







**వైయస్సార్ జిల్లా, పెన్ పవర్ ఏప్రిల్ 19 :** గోవుల సంరక్షణ అందరి బాధ్యతని, పశు సంపదను పెంపొందించడానికి రైతులు ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రామాల్లో పూర్వ వైభవం తీసుకురావాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. శనివారం దువ్వూరు మండలం చల్లబసాయిపల్లి గ్రామం తెలుగుగంగ ఎస్ ఆర్- 1 కొండ ప్రాంతంలోని ముక్తిదామం గోశాలను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి లతో కలసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ముక్తిదామం గోశాలను సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. మాది రైతు కుటుంబమని చిన్న తనంలో గోవులకు మేతకు తీసుకుళ్ళేవాళ్ళమని అన్నారు. ఇప్పటికీ మా గ్రామాల్లో మా అమ్మ గారు 35 గోవులను పెంచుతున్నారన్నారు. సాధ్యవంతమైన మేర గోశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ...గోశాల సందర్శించిన ప్రతిసారి ఆహ్లాదకరమైన ప్రశాంత అనుభూతి కలుగుతుందన్నారు. ముక్తిదామం గోశాలలో దాదాపు 350 గోవులను పెంచడం పుణ్య కార్యక్రమమని ఇందుకు కమిటీ వారికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామస్తులు రైతులు దాతలు గోశాల అభివృద్ధికి తోడ్పాటున అందించాలన్నారు. గోశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజు రెడ్డి మాట్లాడుతూ... గోవుల పెంపకంలో అందరి కలిసికట్టుగా పనిచేయాలన్నారు. గోవులకు పశుగ్రాసం అందజేయడానికి భూమిని కేటాయించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ను కోరారు. ఆవుల పెంపకం నాటి ప్రస్తుత కాలంలో తగ్గిందని రైతులు ప్రతి ఒక్కరూ కనీసం ఒక ఆవును పెంచాలన్నారు. సమాజ శ్రేయస్సుకు గోశాలలు తోడ్పడుతాయని అందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. ముందుగా జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యేలతో కలిసి కొండ ప్రాంతంలోని భూములను పరిశీలించారు అనంతరం వారు గోశాలను సందర్శించి గోవులకు పశుగ్రాసం అందజేశారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డిఓ సాయి శ్రీ,పశుసంవర్ధక శాఖ జెడి శారదమ్మ, గోశాల కమిటీ సభ్యులు నిర్వాహకులు ప్రభాకర్ రెడ్డి జయరాం రెడ్డి, భాస్కర్ రెడ్డి, హరికృష్ణ, గ్రామస్తులు,స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సదుం తాహాశిల్దార్ కార్యాలయంలో ఏసీబీ మెరుపు దాడి



**సదుం/పెన్ పవర్/ఏప్రిల్ 19 :** పుంగనూరు నియోజకవర్గం లోని సదుంమండల తాహాశిల్దార్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహిస్తుండగా కార్యాలయంలో గల అధికారులు వణికిపోయారు.ఓ రైతుకు సంబంధించిన భూ సమస్య పరిష్కారానికి పట్టాదారు పాస్ పుస్తకాలు చేయడానికి సదుం తాహాశిల్దార్, వీఆర్వో డబ్బులు అధిక మొత్తంలో డిమాండు చేశారు.

దీనిని ఆసరాగా చేసుకున్న షఫీ ఉల్లా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు వారి కనుసైగల్లో మరియు వారి పథకం ప్రకారం శనివారం మధ్యాహ్నం షఫీ ఉల్లా అనే రైతు దగ్గర నుంచి లక్ష డెబ్భై ఐదువేలు రూపాయలు డిమాండ్ చేశారు. గత మూడు నెలలుగా మంతనాలు జరిగాయి.

అంత మొత్తం ఇచ్చుకోలేనని శనివారం నాడు డెబ్భై ఐదువేల రూపాయలు తీసుకుంటుండగా ఏసీ బాధికారులు మెరుపు దాడి చేశారు. సదుం తహశీల్దార్ హుస్సేన్, అమ్మగారిపల్లి విఆర్వో మహబూబ్ బాషాలు లంచం తీసుకుంటుండగా ఏసీబి డి.ఎస్.పి విమల కుమారి తహశీల్దార్ హుస్సేన్, విఆర్ఓ మహబూబ్ బాషను డీఎస్పీ విమల కుమారి విచారిస్తున్నారు.

# మళ్లీ నెల్లూరుకు అనిల్



**నెల్లూరు, ఏప్రిల్ 19, పెన్ పవర్:** మాజీ మంత్రి అనిల్ కుమార్ మరోసారి నెల్లూరు రాజకీయాల్లో యాక్టివ్ అయ్యేందుకు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తుంది. నెల్లూరు పట్టణ నియోజకవర్గం నుంచి రెండు సార్లు గెలిచిన అనిల్ కుమార్ ను 2024 ఎన్నికల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్ నరసరావుపేట ఎంపీగా పంపారు. అప్పట్లో ఎంపీతో పాటు స్థానిక నేతలతో అనిల్ కుమార్ యాదవ్ కు పొసగకపోవడంతో ఆయనను పార్లమెంటుకు పంపాలన్న ఉద్దేశ్యంతో నరసరావుపేట నుంచి వైసీపీ అభ్యర్థిగా జగన్ నిలబెట్టారు. అయితే గత ఎన్నికల్లో కేవలం మూడు పార్లమెంటు స్థానాల్లోనే గెలవడం, అనిల్ కుమార్ యాదవ్ కూడా ఓటమి పాలు కావడంతో కొన్నాళ్ల నుంచి ఆయన మౌనంగా ఉంటున్నారు. అయితే గత కొద్ది రోజుల నుంచి ఆయన తిరిగి నెల్లూరు రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నట్లు కనిపిస్తుంది. వరసగా కార్యకర్తలతో సమావేశం అవుతున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ తో సమావేశమయిన తర్వాత ఆయనకు క్లారిటీ వచ్చినట్లుంది. అందుకే తిరిగి ఆయన నెల్లూరు జిల్లా పాలిటిక్స్ లోనే కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు కనపడుతుంది. నెల్లూరు జిల్లాలోనే ఎక్కువగా తిరుగుతూ పార్టీ క్యాడర్ ను తిరిగి ఉత్తేజం చేసే ప్రయత్నం అనిల్ కుమార్ యాదవ్ చేస్తున్నారు. 2024 ఎన్నికల ముందు వరకూ నెల్లూరు జిల్లా వైసీపీకి కంచుకోటగా ఉండేది. కానీ 2024 ఎన్నికల్లో పూర్తిగా ఫ్యాన్ పార్టీ పట్టు కోల్పోయింది. గెలిచే స్థానాల్లో కూడా ఓటమి పాలయింది. ఈ నేపథ్యంలో అనిల్ కుమార్ యాదవ్ ను తిరిగి నెల్లూరు జిల్లాకు పంపాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్ నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు ఆయన మాటలను, ఆహార్యం చూస్తుంటే అర్థమవుతుంది. నెల్లూరు జిల్లా అనిల్ కుమార్ సొంత ప్రాంతం కావడంతో పాటు బీసీ సామాజికవర్గానికి చెందిన నేత కావడంతో అనిల్ ను తిరిగి జిల్లానుంచి పోటీ చేయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిసింది. ఈ మేరకు జగన్ స్పష్టమైన హామీ ఇవ్వడంతో నెల్లూరు జిల్లాలో తిరిగి పట్టు నిలుపుకునేందుకు అనిల్ కుమార్ యాదవ్ ప్రయత్నిస్తున్నారు. వైసీపీ ప్రతిపక్షంలో ఉండగా, అధికారంలో ఉండగా ఫైర్ బ్రాండ్ గా ముద్ర పడిన అనిల్ సేవలను తిరిగి నెల్లూరు జిల్లాలోనే వినియోగించుకోవాలని డిసైడ్ అయినట్లు తెలిసింది. అయితే మరొక ప్రచారం కూడా విస్తృతంగా జరుగుతుంది. అనిల్ కుమార్ యాదవ్ వెంకటగిరి వైపు పడిందని పెద్దయెత్తున సోషల్ మీడియాలో క్యాంపెయిన్ జరుగుతుంది. అయితే వెంకటగిరిలో ఇప్పటికే ముఖ్యమైన నేత నేదురుమిల్లి రామ్ కుమార్ రెడ్డి ఉండటంతో ఆయనను తప్పించి అనిల్ కుమార్ యాదవ్ ను పంపుతారని అనుకోలేం. ఆయనకు తిరిగి నెల్లూరు టౌన్ నుంచి పోటీ చేయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు కనపడుతుంది. అనిల్ కూడా తనకు పట్టున్న నెల్లూరు పట్టణం నుంచి తిరిగి పోటీ చేయాలన్న పట్టుదలతో ఉన్నట్లు కనిపిస్తుంది. ప్రసుతం నెల్లూరు సిటీ,రురల్ కో ఆర్డినేటర్ గా అనిల్ కుమార్ యాదవ్ కొనసాగుతున్నారు. మొత్తం మీద వైసీపీ ఫైర్ బ్రాండ్ మళ్లీ యాక్టివ్ అవుతున్నట్లు కనిపిస్తుంది.

# అమాత్య... యోగం ఎప్పుడు

**విజయవాడ,, ఏప్రిల్ 19, పెన్ పవర్:** జనసేన నేత నాగబాబుకు మంత్రి పదవి అందనంత దూరంలోనే ఉంది. ఆయనకు అస్సలు మంత్రి పదవి వస్తుందా? రాదా? అన్నది అనుమానం ఇప్పుడు అందరిలోనూ బయలుదేరింది. ఎమ్మెల్యే అయిన తర్వాత ఆయనకు మంత్రి పదవి వస్తుందని, పార్టీ కోసం కష్టపడిన నాగబాబుకు మంత్రి పదవి ఇవ్వడంలో ఎవరికీ అభ్యంతరం ఉండదని పవన్ కల్యాణ్ బహిరంగంగానే చెబుతున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారెవరైనా సరే పదవులు వస్తాయని పవన్ అన్నారు. పవన్ కల్యాణ్ చెప్పిన దాని ప్రకారం ఉగాది నాటికే నాగబాబు మంత్రి పదవి లభిస్తుందని చెప్పారు. అయితే ఉగాది వెళ్లిపోయినా ఇప్పటి వరకూ నాగబాబు మంత్రి పదవిపై ఊసే లేదు. పవన్ కల్యాణ్ చిన్న కుమారుడికి సింగపూర్ లో ప్రమాదం జరగడం, తర్వాత ఆయన వెన్ను నొప్పితో బాధపడుతుండటంతో పాటు కొన్ని సమస్యలతో నాగబాబు మంత్రి పదవి మరికొన్నాళ్లు వాయిదా పడినట్లు తెలిసింది. దీంతో పాటు చంద్రబాబు నాయుడు కూడా ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అక్కడి నుంచి పదిహేడో తేదీ నుంచి ఐదు రోజుల పాటు యూరప్ పర్యటనలో ఉంటారు. చంద్రబాబు తన 75వ పుట్టిన రోజు వేడుకలను జరుపుకునేందుకు వెళుతున్నారు. దీంతో పాటు వచ్చే నెల 2వ తేదీన ప్రధాని మోదీ పర్యటన అమరావతిలో ఉండనుంది. అంటే మే మొదటి వారం వరకూ నాగబాబు మంత్రి పదవి గురించి ఆలోచన చేసే అవకాశం ఉండకపోవచ్చు. నాగబాబును పిఠాపురం నియోజకవర్గానికి పంపిన పవన్ కల్యాణ్ అక్కడ పరిస్థితులను చక్కబెట్టాలని భావిస్తున్నారని తెలిసింది. మంత్రి పదవిలో ఉంటే పిఠాపురంలో మరింతగా రాజకీయ ఇబ్బందులు ఎదురవుతాయన్న ఆలోచన కూడా పవన్ చేస్తున్నట్లు తెలిసింది. ఎమ్మెల్సీగా ఉండి పిఠాపురంలో అన్నీ చక్కబెట్టేందుకు నాగబాబు సేవలను ఉపయోగించుకుంటే మంచిదని పవన్ కల్యాణ్ ఆలోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు కూడాచెబుతున్నాయి. అందుకే పవన్ కల్యాణ్ కూడా మంత్రి పదవి విషయంలో చంద్రబాబు వద్ద పట్టుబట్టడం లేదని, నిజంగా మంత్రి పదవి ఇవ్వాలనుకుంటే వెంటనే చంద్రబాబుతో మాట్లాడి గవర్నర్ అపాయింట్ మెంట్ తీసుకుని ప్రమాణ స్వీకారం చేయించేవారంటున్నారు.. కుటుంబంలో ఇద్దం మంత్రివర్గంలో ఉంటే పార్టీని బలోపేతం చేయడం కుదరదని కూడా పవన్ కల్యాణ్ భావిస్తున్నారని అంటున్నారు. అందుకే నాగబాబుకు పిఠాపురం బాధ్యతలను అప్పగించి తాను జిల్లాల పర్యటనలు చేయించాలన్న ఉద్దేశ్యంతో పవన్ కల్యాణ్ ఉన్నట్లు చెబుతున్నారు. ఏమాత్రం పవన్ కల్యాణ్ కు ఆలోచన ఉన్నా వెంటనే మంత్రి పదవి విషయం చంద్రబాబు వద్ద ప్రస్తావించే వారంటున్నారు. దీంతో పాటు ఇప్పుడు మంత్రి వర్గ విస్తరణ జరిపితే చంద్రబాబుకు కూడా తలనొప్పిగా ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా వస్తున్న నేపథ్యంలో నాగబాబుకు మంత్రి పదవి ఇప్పట్లో లేనట్లేనన్న ప్రచారం మాత్రం జనసేన లో బాగా వినపడుతుంది.

# రోజాకు జనసేన వార్నింగ్



**తిరుపతి, ఏప్రిల్ 19,పెన్ పవర్:** తిరుమల గోశాల వివాదం రచ్చ రచ్చ అవుతోంది. గోవుల మరణాలపై వైసీపీ వర్సెస్ టీడీపీ యుద్ధమే జరుగుతోంది. భూమనకు మద్దతుగా గురువారం రోజా ఎంట్రీ ఇచ్చారు. అయితే, టీటీడీనో, టీడీపీనో విమర్శించకుండా పవన్ కల్యాణ్‌పైనే ఎక్కువగా అటాక్ చేస్తూ మైండ్ గేమ్ ఆడారు ఆర్కే రోజా. సనాతన ధర్మాన్ని కాపాడుతానని చెబుతున్న పవన్ కల్యాణే.. టీటీడీ అరాచకాలు, గోవుల మృతిపై సమాధానం చెప్పాలని నిలదీశారు. తిరుమల వెంకన్నతో పెట్టుకుంటే ఎవరికీ పుట్టగతులు ఉండవని.. పవన్‌కు కూడా ఇటీవలే ఈ విషయం అనుభవంలోకి వచ్చిందంటూ.. పరోక్షంగా మార్క్ శంకర్ ఘటనను ప్రస్తావిస్తూ కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు.తమ సేనానిని రోజా అన్నేసి మాటలు అంటుంటే జనసైనికులు ఊరుకుంటారా? ఆ పార్టీ సీనియర్ లీడర్ బొలిశెట్టి సత్యనారాయణ, జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్‌లు రంగంలోకి దిగారు. రోజాకు అర్థమయ్యే భాషలోనే ఘాటైన విమర్శలు చేశారు. గోశాల ఘటనపై భూమన కరుణాకర్‌రెడ్డి డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు.కరుణాకర్‌రెడ్డి హారతి డ్రామా ఆడారని.. ఇప్పుడు గోవుల డ్రామా ఆడుతున్నారని జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ మండిపడ్డారు. భూమాన వలన తిరుమల ప్రతిష్ఠ దిగజారిందన్నారు. గోశాలకు వెళ్లనివ్వడం లేదని కరుణాకర్ రెడ్డి అనడం పచ్చి అబద్ధమన్నారు. ఇక, రోజాను మాటలతో చెడుగుడు ఆడుకున్నారు బొలిశెట్టి. ఆర్కే రోజా.. ఆడా, మగా, హిజ్రా కూడా కాని.. నాల్గవ జాతికి చెందిన వ్యక్తి అంటూ ఫైర్ అయ్యారు. రోజా గతంలో దర్శనం టికెట్లు బ్లాక్‌లో అమ్ముకొని కోట్లు గడించారని విమర్శించారు. ఇప్పుడా దందా ఆగిపోవడంతో.. తిరుమలపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.జనసేన విశాఖ కార్పొరేటర్, ఫైర్ బ్రాండ్ లీడర్.. మూర్తియాదవ్ మరింత రెచ్చిపోయారు. టీటీడీ చైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల కొండపై అన్యమత ప్రచారానికి ఒడిగట్టారని విమర్శించారు. ఇప్పుడు గోశాల వివాదం తీసుకువచ్చి తిరుమల పవిత్రతను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.రోజా.. చిత్తూరు చిత్రాంగి అని.. ఐరన్ లెగ్ లేడీ అంటూ మండిపడ్డారు మూర్తి యాదవ్. రోజా తన ఐరన్ లెగ్‌తో వైజాగ్ ఋషికొండ ప్యాలెస్‌కు గృహ ప్రవేశం చేశారని.. అది ఇప్పటికీ అలాగే ఉండిపోయిందని ఎద్దేవా చేశారు. నగరి ప్రజలు రోజా నడ్డి విరిచిన ఇంకా బుద్ధి రాలేదని అన్నారు. రోజా ఆ చిత్రాలలో నటించలేదని తిరుమలలో ప్రమాణం చేయగలరా? అని ప్రశ్నించారు మూర్తి యాదవ్.టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ వైజాగ్ వాడు అంటూ చులకన చేసి మాట్లాడారని రోజాను తప్పుబట్టారు. వారం రోజులలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌కు బహిరంగ క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. రోజా సారీ చెప్పకపోతే.. ఆమెను వైజాగ్‌లో అడుగుపెట్టనివ్వమని సవాల్ చేశారు మూర్తి యాదవ్.

## ఎమ్మెల్యే బెదిరింపులపై విచారణ షురూ..

**కడప, ఏప్రిల్ 19, పెన్ పవర్:** రాయలసీమ రాజకీయాలు అదో టైప్. అక్కడ నేతలే ఎవ్రిథింగ్. ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే ఏదైనా జరగాలి. అక్కడ నో రూల్స్. నో చట్టం. ఓన్లీ డిక్టేటర్‌షిప్. కాదూ కూడదు అంటే రక్తచరిత్రనే. దశాబ్దాలుగా అదే తీరు. గతంలో ఫ్యాక్షనిస్టులు ఇలాంటి దందాలు చేసేవారు. ఆ తర్వాత ఫ్యాక్షన్ ఖద్దరు చొక్కా తొడగడంతో.. రాజకీయ నేతలే రాయలసీమను శాసించారు. ఇదంతా గతం. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. చట్టం ఎవరికీ చుట్టం కాదంటోంది. కానీ, ఇప్పటికీ అక్కడక్కడా పాత వాసనలు కనిపిస్తూనే ఉన్నాయి. ఫ్యాక్షన్ మార్క్ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఉదంతం కడప జిల్లాలో చర్చనీయాంశమైంది. ఏపీలోనూ రీసౌండ్ వస్తోంది. బీజుపీకి చెందిన జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. కడప జిల్లాలో అల్ట్రాటెక్ సిమెంట్స్‌ను ఎమ్మెల్యే బెదిరిస్తున్నట్టు చెబుతున్నారు. సంస్థలో ప్రతి పనికి సంబంధించిన అన్ని కాంట్రాక్టులను తనకు, తన వారికే ఇవ్వాలని ఎమ్మెల్యే పట్టుబడుతున్నారని అల్ట్రాటెక్ సిమెంట్స్ యాజమాన్యం ఆరోపిస్తోంది. ఇప్పటికే ఆదినారాయణరెడ్డికి కొన్ని కాంట్రాక్టులు ఇచ్చామని, అన్ని కాంట్రాక్టులు శాసనసభ్యుడుకే ఇవ్వడం సాధ్యం కాదని ఆ సంస్థ చెబుతోంది. ఆయన చెప్పినట్లు చేయకపోవడంతో తమ సిమెంట్ ఫ్యాక్టరీలకు రావాల్సిన ముడి పదార్థాల సరఫరాను ఆదినారాయణరెడ్డి అడ్డుకుంటున్నారని అల్ట్రాటెక్ కంపెనీ అంటోంది. సిమెంట్ పరిశ్రమలకు లారీలు వెళ్లకుండా వాహనాలు అడ్డుపెట్టి, తన మనుషులను కాపలా పెట్టారని చెబుతోంది.చిలమకూరు ప్లాంట్‌లో సిమెంట్ ఉత్పత్తి ఆగిపోయిందని, యర్రగుంట్ల ప్లాంట్‌లోనూ ఉత్పత్తి ఆగిపోయే పరిస్థితి రావడంతో.. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని అల్ట్రాటెక్ వెల్లడించింది. ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన కలెక్టర్.. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు జగదీశ్వర్‌రెడ్డితో సహా పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అల్ట్రాటెక్ సిమెంట్స్‌కు ముడి పదార్థాల రవాణా పునరుద్ధరించారు.తనపై వచ్చిన ఆరోపణలపై ఆదినారాయణరెడ్డి స్పందించారు. అల్ట్రాటెక్ సిమెంట్స్ యాజమాన్యం వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని %మీూా% అన్నారు. ఎన్నిసార్లు చెప్పినా తీరు మార్చుకోవడం లేదని చెప్పారు. స్థానికులకు ఉపాధి దొరుకుతుందనే ఉద్దేశంతోనే గతంలో ఫ్యాక్టరీ నిర్మాణానికి సహకరించామని గుర్తుచేశారు. అల్ట్రాటెక్ సిమెంట్స్ తీరుతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని.. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లానని %మీూా% చెబుతున్నారు. విదేశీ పర్యటన నుంచి ముఖ్యమంత్రి తిరిగొచ్చాక స్వయంగా కలిసి పరిస్థితి వివరిస్తానన్నారు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి.

## తిరుమల గోశాలలో ఏం జరుగుతోంది...

**తిరుమల, ఏప్రిల్ 19, పెన్ పవర్:** తిరుపతి శ్రీ వెంకటేశ్వర గో సంరక్షణశాల చుట్టూ రాజకీయ వివాదం రోజురోజుకూ ఉద్రిక్తంగా మారుతోంది. వైసీపీ నాయకుడు, మాజీ టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి..గత 3నెలల్లో టీటీడీ గోశాలలో 100కు పైగా గోవులు చనిపోయాయని ఆరోపించడంతో ఈ వివాదం మొదలైంది. అయితే గోవుల మరణాలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, టీటీడీ నిర్లక్ష్యం కారణమని సంచలన వ్యాఖ్యలు చేశారు.గోశాల నిర్వహణలో లోపాలు, గోవులకు సరైన ఆహారం, వైద్య సంరక్షణ లేకపోవడం వల్లే ఈ మరణాలు సంభవించాయని భూమన ఆరోపించారు. అంతేకాక, గోశాల నిర్వహణ బాధ్యతలు అనుభవంలేని డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌కు అప్పగించారని విమర్శించారు. అయితే భూమన కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలపై స్పందించిన టీటీడీ వాటిని తోసిపుచ్చింది.గోశాలలో 100 గోవులు చనిపోయాయనే వాదనలను ఫేక్ న్యూస్ గా అభివర్ణించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న చనిపోయిన గోవుల ఫొటోలు టీటీడీ గోశాలకు సంబంధించినవి కావని స్పష్టం చేసింది. అసలు భూమన ఈ విషయం ఎందుకు బయటకు చెప్పారనే దానిపై బీఆర్ నాయుడు వివరిస్తూ సస్పెండ్ అయిన మాజీ గోశాల అధికారి హరినాథ్ రెడ్డి ఇచ్చిన తప్పుడు సమాచారాన్ని భూమన ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.ఈ వివాదం నేపథ్యంలో టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్. నాయుడు, బోర్డు సభ్యుడు జి. భాను ప్రకాష్ రెడ్డి గోశాలను సందర్శించి, గోవులకు సరైన ఆహారం, వైద్య సదుపాయాలు అందుతున్నాయని స్పష్టం చేశారు. గత మూడు నెలల్లో 40-43 గోవులు వృద్ధాప్యం, వ్యాధుల కారణంగా మరణించాయని..ఇది సహజమైనదని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు.అయితే ఈవో చెప్పిన గోవుల సంఖ్యపై భూమన మరోసారి సందేహం వ్యక్తం చేస్తూ టీటీడీ అధికారులు, ఛైర్మన్, సీఎం చంద్రబాబు ఇచ్చిన సమాచారం వైరుధ్యంగా ఉందని విమర్శించారు. దీనిపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మరోసారి స్ట్రాంక్ కౌంటర్ ఇచ్చారు. ఆనాటి ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భూమన కూటమి ప్రభుత్వంపై బురదచల్లే కార్యక్రమం చేస్తున్నాడని మండిపడ్డారు.అసలు హరినాథ్ రెడ్డి అన్నింటికి తెగించి భూమనకు సమాచారం ఇవ్వడం, దాన్ని వైసీపీ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ చేయడంతో విస్తృతంగా ప్రచారం చేయడం వెనుక అనేక ఆసక్తికరమైన విషయాలు దాగున్నాయట. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుకాగానే టీటీడీని సమూళంగా ప్రక్షాళన చేయాలని భావించి వెంటనే చర్యలు చేపట్టింది.అందులో భాగంగా శ్రీవారి గోశాలపై విజిలెన్స్ విచారణ జరిపించింది. దీంతో నివేదిక బయటకు వచ్చింది. టీటీడీలో జరిగిన అక్రమాలను వెలికి తీయడంతో పాటు భవిష్యత్ లో అలాంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకోవడంలో భాగంగా విజిలెన్స్ నివేదిక బయటకు రాబోతుందని తెలిసిన వెంటనే వైసీపీ నేతలు ముందుగా గోశాలపై ఆరోపణలు చేయడం ప్రారంభించారంట. 100 ఆవులు చనిపోయినట్లు ప్రచారానికి తెరతీశారు. వైసీపీ సోషల్ మీడియా మొత్తం ఇలాంటి పోస్టులతోనే నిండిపోయిందట.గత ప్రభుత్వంలో టీటీడీలో జరిగిన దారుణాలు ఎక్కడ బయట పడతాయో అన్న భయంతో ముందుగానే రోడ్డెక్కి నిందలు వేస్తున్న వైసీపీ నేతల ప్రయత్నాల్లో భాగంగానే టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి కూటమి సర్కార్ పై లేనిపోని నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నాడని తెలుగు తమ్ముళ్లు ఆరోపిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఆ నేరాలు ఘోరాలు జరిగాయని%ొా%అవన్నీ కూటమి సర్కార్ పై రుద్దే ప్రయత్నం భూమన చేస్తున్నాడని మండిపడుతున్నారంట.వైసీపీ హయాంలో చాలా చోట్ల గోవులు లేకుండానే దాణా కొనుగోలు అంటూ భారీ అవినీతి చేసినట్లు విజిలెన్స్ నివేదికలో బయటపడిందట. అంతేకాదు గోవులకు నాసిరకం దాణా, కాలం చెల్లిన మందులు ఇచ్చి నోరులేని మూగజీవాల ప్రాణాలను బలిగొన్నట్లు రిపోర్టులో ఉందట. ఇవన్నీ ఎక్కడ బయటపడి తమ మెడకు చుట్టుకుంటాయో అన్న అనుమానంతోనే భూమన ఫేక్ ఫోటోలతో టీటీడీ ప్రతిష్టే కాదు..కూటమి సర్కార్ పై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని అంతా టాక్ విన్పిస్తోంది. మరి గోశాల వివాదం ఇంతటితో ఆగిపోతుందా..మరిన్ని మలుపులు తిరుగుతుందా అనేది చూడాలి.

## ఏపీ ఎంపీల్లో విజయనగరమే టాప్

**విశాఖపట్టణం, ఏప్రిల్ 19, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ నుంచి 25 మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అందులో తెలుగుదేశం పార్టీ నుంచి 16, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు, బిజెపి నుంచి ముగ్గురు, జనసేన నుంచి ఇద్దరు ఉన్నారు. అయితే వీరు పార్లమెంటుకు హాజరవుతున్న తీరు, సభలో వారు లేవనెత్తుతున్న ప్రశ్నలు, చర్చల్లో పాల్గొనడం పై ఓ రిపోర్టు విడుదలైంది. ఎంపీల పనితీరుపై పిఆర్ఎస్ ఇండియా సమాచారం సేకరించింది. 18వ లోక్సభ బడ్జెట్ సమావేశాలు ఇటీవల ముగిసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ రిపోర్టు నివేదికను బయటపెట్టింది పిఆర్ఎస్ ఇండియా. ఎంపీల హాజరు విషయానికి వస్తే.. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, అమలాపురం ఎంపీ జిఎం హరీష్ 99% పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యారు. విశాఖ ఎంపీ శ్రీ భరత్ 97%, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు 93% తో రెండు మూడు స్థానాల్లో ఉన్నారు. హాజరులో ముందున్నది వీరే పార్లమెంటుకు 90 శాతానికి పైగా హాజరైన వారిలో ఏడుగురు ఎంపీలు ఉన్నారు. వారిలో కలిసెట్టి అప్పలనాయుడు, జిఎం హరీష్, శ్రీ భరత్, దగ్గుమల్ల ప్రసాదరావు, బస్తీపాటి నాగరాజు, అంబికా లక్ష్మీనారాయణ ఉన్నారు. అయితే వీరంతా తొలిసారిగా ఎంపీలుగా ఎన్నికైన వారే. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ అవినాష్ రెడ్డి 54% హాజరుతో చివరి స్థానంలో ఉన్నారు.లోక్సభలో ప్రశ్నలు వేయడంలో సైతం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మొదటి స్థానంలో ఉన్నారు. ఆయన ఏకంగా 89 ప్రశ్నలు వేసి రికార్డు సృష్టించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి 84 ప్రశ్నలతో రెండవ స్థానంలో నిలిచారు. చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు, ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ 82 ప్రశ్నలు వేసి మూడో స్థానంలో నిలిచారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ అత్యల్పంగా 22 ప్రశ్నలు అడిగారు.లోక్సభలో విషయానికి వస్తే తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు 22 చర్చల్లో పాల్గొని టాప్ గా నిలిచారు. వైయస్సార్సీపీకి చెందిన తిరుపతి ఎంపీ గురుమూర్తి 19 చర్చలతో రెండవ స్థానంలో నిలిచారు. జనసేన కు చెందిన మచిలీపట్నం ఎంపీ బాలసౌరి 18 చర్చలతో మూడో స్థానంలో ఉన్నారు. హిందూపురం ఎంపీ పార్థసారథి మాత్రం కేవలం ఒకే చర్చలో మాత్రమే పాల్గొన్నారు. అయితే ఏపీ నుంచి 25 మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ ఏపీ సమస్యలపై వారు ప్రశ్నించడం లేదన్న విమర్శ ఉంది. అయితే పార్లమెంటుకు ఎన్నికైన వారు మాత్రం హాజరు వేసుకోవడం, ప్రశ్నలు వేయడం, చర్చల్లో పాల్గొనడం లో ముందు వరుసలో నిలవడం విశేషం.

## టిమ్ డేవిడ్ అరుదైన రికార్డ్.. ఈ సీజన్‌లో ఎవరికీ సాధ్యం కాలేదు



**హైదరాబాద్ పెన్ పవర్:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫినిషర్ టిమ్ డేవిడ్ ప్రస్తుత ఐపీఎల్ సీజన్ లో అదరగొడుతున్నాడు. ఎవరు ఆడినా ఆడకపోయినా ఈ ఆసీస్ స్టార్ జట్టులో నిలకడగా ఆడుతూ తన పాత్రకు న్యాయం చేస్తున్నాడు. ఇప్పటివరకు ఆడిన మ్యాచ్ ల్లో 160 కి పైగా స్ట్రైక్ రేట్ తో బ్యాటింగ్ చేసి సూపర్ ఫామ్ లో ఉన్నాడు. శుక్రవారం (ఏప్రిల్ 18) చిన్న స్వామి వేదికగా పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో ఒక్కడే హాఫ్ సెంచరీ చేసి ఆర్సీబీ పరువు కాపాడాడు. 26 బంతుల్లోనే 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 50 పరుగులు చేసి మ్యాచ్ మొత్తంలో టాప్ స్కోరర్ గా నిలిచాడు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ.. ఒక దశలో 42 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. 14 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్ లో టిమ్ డేవిడ్ ఒక్కడే లోయర్ ఆర్డర్ తో కలిసి జట్టు స్కోర్ ను 95 పరుగులకు చేర్చాడు. ఈ మ్యాచ్ లో ఆర్సీబీ ఓడిపోయినా ఈ ఆసీస్ స్టార్ బ్యాటింగ్ అభిమానులని ఆకట్టుకుంది. మ్యాచ్ ముగిసిన తర్వాత ప్లేయర్ ఆఫ్ మ్యాచ్ అవార్డు డేవిడ్ కు దక్కడం విశేషం. ఓడిపోయినా జట్టులోని ఆటగాడు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకోవడం ఈ సీజన్ లో ఇదే తొలిసారి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ తో పాటు మొత్తం మూడు అవార్డ్స్ డేవిడ్ గెలుచుకున్నాడు. సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది మ్యాచ్.. సూపర్ సిక్సస్ ఆఫ్ ది మ్యాచ్.. ఆన్ ది గో ఫోర్స్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు గెలుచుకున్నాడు. శుక్రవారం (ఏప్రిల్ 18) రాత్రి వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ పెర్ఫామెన్స్‌తో ఆకట్టుకున్న పంజాబ్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో ఆర్సీబీని ఓడించి ఐదో విజయం ఖాతాలో వేసుకుంది. వర్షం కారణంగా 14 ఓవర్లకు కుదించిన పోరులో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ 95/9 స్కోరు చేసింది. అనంతరం పంజాబ్ 12.1 ఓవర్లలోనే 98/5 స్కోరు చేసి గెలిచింది.

## సంజు శాంసన్, ద్రవిడ్ మధ్య విభేదాలు.. క్లారిటీ ఇచ్చిన హెడ్ కోచ్



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజు సామ్సన్, ద్రవిడ్ మధ్య విభేదాలు ఉన్నాయనే వార్తలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ తో మ్యాచ్ సందర్భంగా సంజు శాంసన్ ను సంప్రదించకుండానే సూపర్ ఓవర్ లో ఎవరిని దించాలో నిర్ణయించినట్టు టాక్. జట్టులో శాంసన్ కంటే ద్రవిడ్ ఎక్కువగా జోక్యం చేసుకుంటున్నాడని కొంతమంది ఆరోపించారు. అయితే ఈ పుకార్లను ఆ జట్టు ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ తీవ్రంగా ఖండించారు. శనివారం (ఏప్రిల్ 19) లక్నో సూపర్ జయింట్స్ తో జరగబోయే మ్యాచ్ కు ముందు జరిగిన విలేకరుల సమావేశంలో ద్రవిడ్ మాట్లాడారు. శాంసన్, ఫ్రాంచైజీకి మధ్య వస్తున్న వార్తలు "నిరాధారమైనవి" అని తెలిపారు. ప్లేఆఫ్ స్థానం కోసం జట్టు ఐక్యంగా ఉందని ఆయన తెలిపారు. సంజు సామ్సన్ జట్టు సమావేశంలో పాల్గొనడం లేదని, అక్కడ ద్రవిడ్ సహాయక సిబ్బందితో కొంతమంది ఆటగాళ్లతో చర్చలు జరుపుతున్నట్లు చూపించే వీడియో వైరల్ అవుతున్న తరుణంలో ఈ ఊహాగానాలు ప్రారంభమయ్యాయి. "ఈ నివేదికలు ఎక్కడి నుండి వస్తున్నాయో నాకు తెలియదు. సంజు మరియు నేను ఒకే మాట మీద ఉన్నాము" అని ద్రవిడ్ అన్నాడు. రాజస్థాన్ రాయల్స్ ఐపీఎల్ లో మరో కీలక మ్యాచ్ కు సిద్ధమవుతుంది. శనివారం (ఏప్రిల్ 19) లక్నో సూపర్ జయింట్స్ తో అమీ తుమీ తేల్చుకోనుంది. ఇప్పటివరకు ఆడిన ఏడు మ్యాచ్ ల్లో రాజస్థాన్ కేవలం రెండు మాత్రమే గెలిచింది. నేడు జరగనున్న మ్యాచ్ లో ఓడిపోతే ప్లే ఆఫ్ ఆశలు సంక్లిష్టం అవుతాయి. ఈ మ్యాచ్ లో రాజస్థాన్ కెప్టెన్ సంజు శాంసన్ ఆడతాడా లేదా అనే విషయంలో క్లారిటీ లేదు. ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్ లో బ్యాటింగ్ చేస్తూ గాయం కారణంగా మధ్యలోనే రిటైర్డ్ హర్ట్ గా వెనుదిరిగాడు.

## బాదేసిన బట్లర్.. గుజరాత్ టైటాన్స్‌కు ఐదో విజయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ ఐదో విజయం అందుకుంది. సొంతగడ్డపై దిల్లీ క్యాపిటల్స్ (%ణవశ్రీష్ట్రఱ ఝజూఱ్ఱశ్రీం%)తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 7 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన డీసీ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యాన్ని గుజరాత్ 19.2 ఓవర్లలో ఛేదించింది. వన్‌డౌన్ బ్యాటర్ జోస్ బట్లర్ (97లిబీ 54 బంతుల్లో 48 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. ఓపెనర్ సాయి సుదర్శన్ (36బీ 21 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడాడు. షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (43బీ 33 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించాడు. చివరి ఓవర్‌లో గుజరాత్ విజయానికి 10 పరుగులు అవసరం కాగా.. రాహుల్ తెవాతియా (11లిబీ 3 బంతుల్లో) వరుసగా సిక్స్, ఫోర్ కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. ఏడు మ్యాచ్‌ల్లో దిల్లీకిది ఇది రెండో ఓటమి. ఐపీఎల్‌లో గుజరాత్‌కు ఇదే అత్యధిక విజయవంతమైన లక్ష్యఛేదన. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిల్లీ.. బ్యాటర్లలందరూ సమష్టిగా రాణించడంతో భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు అభిషేక్ పొరెల్ (18బీ 9 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), కరుణ్ నాయర్ (31బీ 18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించారు. తర్వాత వచ్చిన కేఎల్ రాహుల్ (28బీ 14 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడాడు. అక్షర్ పటేల్ (38బీ 32 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (31బీ 21 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. చివర్లో అశుతోష్ శర్మ (37బీ 19 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) విరుచుకుపడ్డాడు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ (4/41) అర్షద్ ఖాన్, సిరాజ్, ఇషాంత్ శర్మ, సాయి కిశోర్ ఒక్కో వికెట్ పడగొట్టారు

# ఈ మూవీలో ఎన్టీఆర్ ఫైట్స్ ఆ లెవల్లో?

మాస్‌ని పదే పదే థియేటర్లకు రప్పించేందుకు ఐటమ్ పాట ఎంత ముఖ్యమో, యాక్షన్ సీన్స్, ఎమోషన్స్ కూడా అంతే ముఖ్యం. ముఖ్యంగా యాక్షన్ పార్ట్ అత్యంత కీలకం. కానీ రొటీన్ ఫైట్స్ తో అన్నిసార్లు మెప్పించడం కుదరదు. ప్రతిసారీ ఏదో ఒక కొత్తదనాన్ని చూపించాలి. అలా చూపించడంలో సక్సెసయ్యారు గనుకే ధూమ్, క్రిష్ ఫ్రాంచైజీలు అంత పెద్ద సక్సెసయ్యాయి. యాక్షన్ అడ్వెంచర్లకు ఎప్పుడూ ఆదరణ దక్కుతుందనడానికి ఇటీవలి బ్లాక్ బస్టర్లు పఠాన్, జవాన్ కూడా ఉదాహరణ.ఇప్పుడు 'వార్ 2'లో హృతిక్ వర్సెస్ ఎన్టీఆర్ పోరాట సన్నివేశాలు ఎలా ఉండబోతున్నాయో! చూడాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఈ మూవీపై దక్షిణాదిన ఆరాలు మొదలయ్యాయి. ఈ సినిమా ఈ ఏడాది దక్షిణాదిన మోస్ట్ అవైటెడ్ చిత్రాల్లో ఒకటిగా పాపులరవ్వడాని కి ఫ్రాంచైజీలోకి ఎన్టీఆర్ ప్రవేశం ఒక కారణం. అందుకే తారక్ ని తెరపై ఎలా చూపించబో తున్నారో చూడాలని అభిమానులు చాలా ఆసక్తిగా వేచి చూస్తున్నారు.తాజా సమాచారం మేరకు ఎన్టీఆర్ యాక్షన్ సీన్స్ నెవ్వర్ బిఫోర్ గా ఉంటాయని, నెక్స్ట్ లెవల్ టేకింగ్ తో రక్తి కట్టిస్తాయని చెబుతున్నారు. బాలీవుడ్ స్టైల్ యాక్షన్ మేకింగ్ కి తారక్ పర్ఫెక్ట్ ఫిట్ అయ్యాడట. మునుపెన్నడూ చూడనంత కొత్తగా తారక్ ని చూస్తారు! అని చెబుతున్నారు. ఎన్టీఆర్ గత సినిమాల్లో యాక్షన్ వేరు.. ఈ సినిమాలో యాక్షన్ వేరు! అని లీక్ అందింది. తారక్ తన కెరీర్ లో అత్యంత స్టైలిష్ గా కనిపించబోతున్న మూవీ కూడా ఇదేనని చెబుతున్నారు.



మన్నారా చోప్రా యొక్క అద్భుతమైన లుక్‌లో మెరుస్తోంది



శ్రీవల్లి లుక్‌లో మెరుస్తోంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com